తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
30 ఏళ్ళ ప్రస్థానం
వార్షికోత్సవం 1996 - 2026

# రోడ్డు అనుమతికి...ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా

## తిరుపతి జిల్లా అటవీ శాఖ అధికారి వి. సాయిబాబా



బాలాయపల్లి, ఆగస్టు 29 ప్రభాతవార్త: మండలం లోని మేల్చూరు నుండి మల్లెమాలకు వెళ్లే ఫారెస్ట్ రోడ్డును తిరుపతి జిల్లా అటవీ శాఖ అధికారి వి. సాయిబాబా పరిశీలించారు. అటవీశాఖ ప్రాంతంలో తారు రోడ్డు నిర్మించే ప్రతిపాదనను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాలని జిల్లా అటవీశాఖ అధికారి తెలిపారు. రోడ్డు కొలతలు తీసుకున్నారు. గత 30 సంవత్సరాలుగా గ్రావెల్ రోడ్‌లోనే ప్రయాణం సాగిస్తున్నామని తారు రోడ్డు కావాలని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ దృష్టికి పెనుశిల శ్రీ లక్ష్మీనరసింహస్వామి బోర్డు మాజీ మెంబర్ సాగి నరసింహులు నాయుడు, కొంతమంది గ్రామస్తులు తీసుకొని వెళ్లగా, ఎమ్మెల్యే అటవీ శాఖ అనుమతులతోనే సాధ్యపడుతుందని తెలిపారు. ఎమ్మెల్యే చొరవతో డిఎఫ్ఓ సాయిబాబా వచ్చి రోడ్డును పరిశీలించారు. పెనుశిల శ్రీ లక్ష్మీనరసింహ స్వామి బోర్డు మాజీ మెంబర్ సాగి నరసింహులు నాయుడు, మరి కొంత మంది గ్రామస్తులు, డిఆర్ఓ కోటేశ్వరరావు, రేంజర్ రమణయ్యలు రోడ్డును పరిశీలించారు. ఈ రోడ్డు ఎన్ని గ్రామాలను కలుపుతుంది. తరచుగా ఈ రోడ్డు మీదుగా ఎంతమంది ప్రయాణిస్తుంటారు. మల్లెమాలలో ఎంతమంది ప్రజలు నివసిస్తుంటారు వంటి ఇతర వివరాలను డీఎఫ్ఓ గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ఈ రోడ్డు కేవలం మల్లెమాల గ్రామానికే వెళుతుందని, 600 కుటుంబాలు ఉన్నట్లు తెలిపారు. ఎస్సీ ఎస్టీ బీసీ కుటుంబాలు ఉన్నాయన్నారు. ఈ రోడ్డు భైరవరం ఫారెస్ట్ ఏరియాకు సంబంధించిందని రేంజర్ కోటేశ్వరరావు డిఎఫ్ఓకు తెలిపారు. రూ.1 కోటి 50 లక్షలు రూపాయలతో ఇప్పటికే ప్రతిపాదనలు పంపామని, ఎమ్మెల్యే కృషితో 30 ఏళ్ళ నాటి కల సాకారమవు తుందని సాగి నరసింహులు నాయుడు తెలిపారు. అనుమతులు వచ్చిన వెంటనే రోడ్డు పనులు ప్రారంభిస్తామని అన్నారు. నివేదికను ఉన్నతాధికారులకు ఈరోజే పంపుతామని డిఎఫ్ఓ గ్రామస్థులకు తెలిపారు. డిఎఫ్ వెంట డిఆర్ఓ కోటేశ్వరరావు, రేంజర్ రమణయ్య అనూష తదితరులు ఉన్నారు.

### ఘనంగా ముగిసిన...

# అమరావతి ఛాంపియన్షిప్ పోటీలు

## రూ.92లక్షల ప్రైజ్‌మనీని అందజేసిన శాప్‌చైర్మన్, మంత్రులు, ఎమ్మెల్యేలు




అమరావతి చాంఫియన్ షిప్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందిస్తున్న స్పీకర్, మంత్రులు, ఎమ్మెల్యే, శాప్ చైర్మన్

తిరుపతి (కీడ),ఆగస్టు 29 ప్రభాతవార్త: ఈ రోజు తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీ ఆడిటోరియంలో శాప్ చైర్మన్ రవి నాయుడు అధ్యక్షతన అమరావతి ఛాంపియన్‌షిప్-2026 ముగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ శ్రీ చింతకాయల అయ్యన్నపాత్రుడు, రాష్ట్ర గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, రవాణా, క్రీడా శాఖ మంత్రి మండేపల్లి రాంప్రసాద్ రెడ్డి, శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మరియు స్థానిక ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు గారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. శాప్ చైర్మన్ మాట్లాడుతూ, అమరావతి ఛాంపియన్‌షిప్-2026లో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2,07,498 మంది క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. జిల్లాస్థాయిలో సుమారు 90 వేల మంది, రాష్ట్రస్థాయిలో సుమారు 10 వేల మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారని వెల్లడించారు. ఈ పోటీలను అండర్-17, అండర్-23 విభాగాల్లో నిర్వహించినట్లు తెలిపారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాలు, ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు, యువ క్రీడాకారులు పాల్గొనడం ద్వారా క్రీడల పట్ల యువతలో ఆసక్తి మరింత పెరుగుతోందని పేర్కొన్నారు. జాతీయ, అంతర్జాతీయ వేదికలపై ప్రతిభ కనబరిచి పతకాలు సాధించి రాష్ట్రానికి పేరు ప్రఖ్యాతులు తీసుకొచ్చిన 264 మంది క్రీడాకారులకు క్రీడా ప్రోత్సాహకాల కింద మొత్తం రూ.8.8 కోట్ల నగదు ప్రోత్సాహకాలను అందజేసినట్లు తెలిపారు.

క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని, ప్రతిభ కలిగిన క్రీడాకారులకు అవసరమైన సహకారం అందిస్తామని చెప్పారు. అదే విధంగా, అమరావతి ఛాంపియన్‌షిప్-2026లో విజయం సాధించిన విజేతలు, రన్నరప్‌లకు కలిపి రూ.92లక్షల ప్రైజ్‌మనీని అందజేశారు. విజేతలను అభినందిస్తూ, భవిష్యత్తులో వారు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించి రాష్ట్రానికి మరింత పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని ఆకాంక్షించారు. తిరుపతిని రాష్ట్రంలోనే ప్రముఖ క్రీడా కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం, శాప్ సమన్వయంతో మరిన్ని చర్యలు చేపడుతున్నట్లు రవి నాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా కలెక్టర్ ఎస్ వెంకటేశ్వర్ ,తిళీ గారు, తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, ఎస్వీ యూనివర్సిటీ మరియు పద్మావతి యూనివర్సిటీ వైస్ ఛాన్సర్ రిజిస్ట్రర్లు, తెలుగుదేశం పార్టీ తిరుపతి నియోజకవర్గ ఇన్చార్జి జేబీ శ్రీనివాసులు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, శాప్ ఎండి శ్రీమతి భరణి, పెద్ద ఎత్తున క్రీడాకారులు పాల్గొన్నారు.

# పంటలపై ఏనుగుల దాడి!

## చేతికోచ్చిన పంట నాశనమవుతుంటే...ఎవరికీ చెప్పుకోవాలని రైతుల రోదనలు



చిన్నగొట్టిగల్లు,ఆగస్టు 29 ప్రభాతవార్త: మండలంలో ఏనుగుల సంచారం రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. భాకరాపేటకు చెందిన మల్లికార్జున సాగు చేసిన వరిపంట ను, దిగువూరు గ్రామం గాండ్లపల్లికి చెందిన బయన్న సాగు చేసిన టమోటా పంటను ఏనుగులు ధ్వంసం చేసినట్లు బాధిత రైతులు తెలిపారు. రాత్రి సమయంలో పొలాల్లోకి ప్రవేశించిన ఏనుగుల గుంపు పంటలను తొక్కి, తిని నాశనం చేయడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఎంతో కష్టపడి సాగు చేసిన పంట చేతికొచ్చే సమయంలో ఏనుగుల దాడికి గురికావడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని అటవీ ప్రాంతాలకు సమీపంలో ఉన్న గ్రామాల్లో ఏనుగుల సంచారం తరచూ కొనసాగు తుండటంతో రైతులు, గ్రామస్థులు భయాందోళనకు గురవుతున్నారు. పంటలను రక్షి ంచుకునేందుకు రాత్రివేళల్లో పొలాల వద్ద కాపలా ఉండాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. ఏనుగుల దాడులతో నష్టపోయిన పంటలను అటవీశాఖ, రెవెన్యూ అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించి నష్టాన్ని అంచనా వేయాలని రైతులు కోరుతున్నారు. పంట నష్టపోయిన బాధిత రైతులకు ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ఏనుగుల సంచారాన్ని నియంత్రించేందుకు అటవీశాఖ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టి, రైతుల పంటలకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు.

# స్విమ్స్‌ను మరింత బలోపేతం చేయాలి: ఎమ్మెల్యే



డాక్టర్ జగదీష్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే

తిరుపతి విద్య, ఆగస్టు 29 ప్రభాతవార్త: రాయలసీమ ప్రాంత ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేలా స్విమ్స్‌ను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. శనివారం స్విమ్స్ నూతన డైరెక్టర్ డాక్టర్ జగదీష్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. ప్రభుత్వం కొత్తగా స్విమ్స్ డైరెక్టర్‌గా నియమించిన డాక్టర్ జగదీష్‌కు ఎమ్మెల్యే పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం స్విమ్స్ అభివృద్ధి, వైద్య సేవల విస్తరణ, రోగులకు అందుతున్న సదుపాయాలపై ఇరువురు చర్చించారు. టీటీడీ, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో స్విమ్స్‌లో మౌలిక వసతులను మరింత అభివృద్ధి చేసి, అత్యాధునిక వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే సూచించారు. రాయలసీమతో పాటు ఇతర ప్రాంతాల నుంచి స్విమ్స్‌కు వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.స్విమ్స్ అభివృద్ధికి అవసరమైన సహకారం అందించేందుకు ప్రభుత్వం, టీటీడీతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.

# ఎన్నికలకు పార్టీ కేడర్ సమాయత్తమేదీ!

## -ప్రభావం చూపని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ పర్యటన !



ప్రభాతవార్త-తిరుపతి

దేశంలో బిజెపి ప్రభుత్వం సుపరిపాలన సాగిస్తున్నా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలో బిజెపి గ్రాఫ్ ఆశించిన స్థాయిలో లేదనే విమర్శలు జనం నుండి వ్యక్తమవుతోంది. ముఖ్యంగా రాయలసీమ జిల్లాల్లో బిజెపి ఓటుబ్యాంకు కూడా పెద్దగా లేకపోవడం మరీ విశేషం. రాష్ట్రంలో టిడిపి ఆధ్వర్యంలో బిజెపి కూటమి లో ఓ భాగం. అయితే ఇప్పటివరకు రాష్ట్రంలోనేగాక రాయలసీమ జిల్లాల్లో ఆ పార్టీ ప్రభావం పెద్దగా లేదనేది విమర్శలు. తాజాగా బిజెపి చీఫ్ పివిఎన్ మాధవ్ నాలుగు రోజుల తిరుపతి జిల్లా పర్యటనలో కూడా పార్టీ కేడర్‌తో మమేకమైన సందర్భం లేదనేది పార్టీలో గుసగుసలు. ఆయన జిల్లా పర్యటన పెద్దగా ప్రభావం చూపలేదని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. రాష్ట్ర చీఫ్ పర్యటనలో ఆయన వెన్నంటి ఉండాల్సిన పార్టీలో కేడర్ నాయకులు ఆయనను కలిసిన దాఖలాలు కూడా కనిపించలేదు. రెండు మూడు నెలల్లో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న సమయంలో ఆయన కార్యకర్తలను కార్యోన్ముఖులను చేయడానికి కూడా ప్రయత్నం చేయలేదు. మీడియా కేంద్రమైన తిరుపతిలో కనీసం పత్రికా సమావేశంకుడా ఏర్పాటు చేయలేదు.ఆయన గురువారం రాత్రి తిరుపతి వచ్చి తిరుచానూరు సమీపంలోని ఒక స్టార్ హోటల్లో బస చేశారు.శుక్రవారం ఉదయం తిరుపతిలో వాకర్స్‌తో పిచ్చాపాటిగా మాట్లాడారు. ఆ తరువాత పుత్తూరులో సిద్దార్థ ఇంజనీరింగ్ కాలేజీలో విద్యార్థులతో ముఖా ముఖి నిర్వహించారు. శ్రీకాళహస్తి పర్యటన సాగింది. సాయంత్రం నాయుడుపేటలో పార్టీ కార్యాలయం ప్రారంభించారు.ఆయనతో పాటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ దయాకర్ రెడ్డి పాల్గొన్నారు. శనివారం ఉదయం తిరుపతిలో భజనమండలి కళాకారులు చేపట్టిన నగరసంకీర్తనలో పాల్గొని, తరువాత వేదిక్ యూనివర్సిటీలో జరిగిన రాయలసీమ కేంద్రంగా పర్యాటక, సాంస్కృతిక అభివృద్ధి సెమినార్‌లో పాల్గొన్నారు. రాత్రికి తిరుమలలో బస చేశారు. ఆదివారం ఉదయం శ్రీవారిని దర్శనం చేసుకుని తిరిగి తిరుపతికి చేరుకుంటారు. నేటి ఉదయం తిరుపతి లీలామహల్ కూడలి వద్ద సంచార జాతుల విముక్తి దినోత్సవంలో పాల్గొననున్నారు. అయితే ఈ మూడురోజుల పర్యటనలో రాష్ట్ర రాజకీయ అంశాలను ఎక్కడా పెద్దగా ప్రస్తావించలేదు. తనను కలసిన కార్యకర్తలతో మాత్రం పార్టీ కోసం కష్టపడండి, దైవభక్తితో జీవించండి అంటూ హితోపదేశాలు చేసినట్టు తెలిసింది. దేశంలో ప్రధాని మోదీ అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు గురించి ప్రజల్లోకి తీసుకెళ్ళాలని, కూటమితో కలసి పనిచేయాలని సూచించారు. ఇదిలా ఉండగా మరోవైపు పార్టీలోని ఒక వర్గం నేతలు తిరుపతి పర్యటనలో ఉన్న మాధవ్‌ను పట్టించుకోలేదని సమాచారం. తిరుపతి మేయర్ ఎన్నికలపై కీలక ప్రకటన చేస్తారని కొందరు భావించి నిరాశకు గురయ్యారు. తిరుపతి మేయర్, కనీసం పది కార్పొరేటర్ టిక్కెట్లు అయినా సాధించాలని స్థానిక కార్యకర్తలు ఆశిస్తున్నారు. అయితే మాధవ్ ఎన్నికల ఊసే ఎత్తక పోవడం కార్యకర్తల్లో నిరసన మిగిల్చింది.

# నిండ్ర, విజయపురంలలో మంచినీటికి కటకట

## -ఖాళీ బిందెలతో మహిళల నిరసన -పట్టించుకోని అధికారులు



నిండ్రలో ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు



విజయపురంలో అలంకార ప్రాయంగా మిగిలిన మంచినీటి బోరు

నిండ్ర -విజయపురం, ఆగస్టు 29 ప్రభాతవార్త : నగరి నియోజకవర్గం పరిధిలోని నిండ్ర, విజయపురం మండలాల్లో రెండు గ్రామాల ప్రజలు మంచి నీటికి కటకటలాడుతున్నారు. రోజుల తరబడి తాగు నీరు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. స్థానిక ఎంపిడిఒల దృష్టికి సమస్య తీసుకెళ్లినా పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక బిందె మంచినీటి కోసం అర కిలోమీటరు దూరం వెళ్లి మోసుకుని రావాల్సి వస్తోందని వాపోతున్నారు.

**నిండ్రలో:**

నిండ్ర మండలంలోని మేళంబాకం ఎస్టీ కాలనీవాసులు మంచినీటి కష్టాలు ఎదుర్కొంటున్నారు. గత మూడు వారాలుగా కాలనీకి మంచినీటి సరఫరా జరగడం లేదు. కాలనీలో 150 కుటుంబాలుండగా 800 మందికి పైగా జనాభా నివశిస్తున్నారు. కాలనీకి మంచినీరు సరఫరా చేసే బోరు విద్యుత్ మోటారు కాలిపోవడంతో సమస్య తలెత్తింది. కాలిపోయిన మోటారును మరమ్మతు చేయడానికి వీలులేదని, కొత్త మోటారు కొనుగోలుకు రూ. 70 వేలు ఖర్చవు తుందని కుంటిసాకులు చెబుతూ అధికారులు, ప్రజా ప్రతినిధులు సమస్యను పట్టించుకోవడం మానేశారు. మూడు వారాలుగా సమస్య పరిష్కరించకుండా అధికారులు కాలయాపన చేస్తుండడంతో విసుగెత్తిన మహిళలు శనివారం ఖాళీ బిందెలతో మంచినీటి కుళాయి వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఎంపిడిఒ ఆఫీస్‌కు వెళ్లి ఎంపిడిఒ శివప్రసాద్‌వర్మకు సమస్య వివరించారు. నిధులున్నప్పటికీ సమస్య ఎందుకు పరిష్కరించడం లేదని నిలదీశారు. మంచినీటి సమస్యను పరిష్కరించకపోతే కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన చేపడతామని హెచ్చరించారు.

**విజయపురంలో:**

మండల కేంద్రంలోని దళితవాడలో మంచినీటి బోరు మరమ్మతుకు గురవడంతో రెండు నెలలుగా దళితులు మంచినీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. దళితవాడకు మంచినీటి సరఫరా కోసం వేసిన బోరుకు విద్యుత్ మోటారు బిగించి, పైప్‌లైన్ వేయాల్సి వుండగా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడం వల్ల ప్రజలకు మంచినీటి కష్టాలు తప్పడం లేదు. మంచినీటి సరఫరా కోసం వేలాది రూపాయలు ఖర్చు పెట్టి వేసిన బోరు అలంకారప్రాయంగా మిగిలి పోయింది. దళితవాడలో సుమారు 2000 మంది జనాభా నివశిస్తున్నారు. సర్పంచ్‌ల పాలన ముగిసిన దగ్గర నుంచి అధికారులు గ్రామాల వైపు కన్నెత్తి చూడడం లేదని, సమస్యలు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో...పెట్టుబడి పెట్టే అభ్యర్థి ఎవరు?

## -అనీ రాజకీయ పార్టీల అన్వేషణ



శ్రీకాళహస్తి, ఆగస్టు 29 ప్రభాతవార్త: ఈ సారి శ్రీకాళహస్తి మున్సిపాలిటికి తప్పకుండా ఎన్నికలు జరుగుతాయని సంకేతాలు స్థానిక శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి తమ కార్యకర్తలకు వివరిస్తున్నారు. ఈ నేపధ్యంలో మున్సిపల్ ఎన్నికల్లో పెట్టుబడి పెట్టగల అభ్యర్థుల కోసం పార్టీలు అన్వేషిస్తున్నాయి. ఇప్పటికే తెలుగుదేశం పార్టీ నాయకుడు శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి ముందు జాగ్రత్తగా అన్వేషణ వేగవంతం చేసారు. అయితే రిజర్వేషన్ల ప్రక్రియలో ఈ మున్సిపాలిటి ఎవరికి దక్కుతుందో అనే ఉత్కంఠత చోటు చేసుకుంది. గత వైకాపా పాలనలో 2020లో జరగాల్సిన మున్సిపల్ ఎన్నికలకు సంబం ధించి చేపట్టిన చర్యల్లో డీలిమిటేషన్ ప్రక్రియ సక్రమంగా జరగలేదని నారాయణపురం పంచాయతీ ప్రజలు కోర్టును ఆశ్రయించారు. శ్రీకాళహస్తి మున్సిపాలిటితో పాటు రాష్ట్రంలోని 23 మున్సిపాలిటిలు ఒకే నివేదికలో కోర్టును ఆశ్రయించారు. ఆ మున్సిపాలిటిలలో ఎన్నికలు జరగలేదు. వారి అనైతిక విభజనంతో ఐదేళ్ల పాటు ఆయా మున్సిపాలిటిలకు పాలకమండళ్ళు లేనందువల్ల ఆర్థిక సంఘ నిధులు రాలేదు.అయితే కొత్త ప్రక్రియ ప్రకారం జనాభా ప్రాతిపదిక మీద ఎన్ని వార్డులుంటాయన్నది చర్చనీయాంశంగా ఉంది.

**పెట్టుబడి ఎవరు పెడతారు?**

ప్రజా ఆకర్షణ కలిగిన వ్యక్తి మాత్రమే, ప్రత్యేక్ష ఎన్నినల్లో చైర్మన్ అభ్యర్థిగా నిలదొక్కుకోగలడనేది జగమెరిగిన సత్యం. శ్రీకాళహస్తి మున్సిపాలిటికి ఎన్నికలు జరిగితే బహుశా 44 వార్డులు కావచ్చు, ఓటర్లు 63వేలు కాబట్టి రాజకీయ నాయకుల అంచనాల మేరకు కనీసం రూ.6.5కోట్లు పెట్టుబడి అవుతుందని అంచనా. అంత పెట్టబడి పెట్టగల అభ్యర్థి కోసం పార్టీలు వెతుకుతున్నారు. రాష్ట్రంలో అన్నీ మున్సిపాలిటీలు నిధుల లేమితో అల్లాడుతున్నాయి. మరియు ఇంత పెట్టి గెలిచిన అభ్యర్థులు, తిరిగి ఆ మొత్తాన్ని ఎలా రాబట్టుకోవాలో అర్థం కాని పరిస్థితి. ఓటర్లు మొగ్గు ఎక్కువగా అధికార పార్టీ అభ్యర్థులపై వుంటుంది. ఆ అభ్యర్థికి ఆ వార్డు మంచి పేరు ఉండాలి. అయితే రిజర్వేషన్లపై ఆధారపడి ఉంది. జనరల్ అయితే రెండుపార్టీల్లో పెట్టుబడి ఎవరు పెడతారు? రిజర్వేషన్లు అయితే ఏం చేయాలనే సందిగ్ధంలో ఉన్నారు. ఈ సారి ఎలాగైన ఎన్నికలు జరిపి తెలుగు తమ్ముళ్ళకు కౌన్సిలర్ పదవులతో సంతృప్తి పరచుటకు ప్రణాళిక రచించుకొని ముందుకు వెళుతున్నారు. అయితే వైకాపా పరిస్థితి కూడా ఆశాజనకంగా కనబడడం లేదు. నాడు స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆ పార్టీ వ్యవహారించిన తీరు గుర్తుకు తెచ్చుకుంటున్నారు. అయితే ప్రతి పక్ష వైకాపా నుంచి 8 మంది కౌన్సిలర్లు ఇప్పటికే పార్టీకి గుడ్‌బై చెప్పటానికి పానగల్‌కు చెందిన ఓ యువ నాయకుని సారథ్యంలో ఉన్నారని తెలుస్తోంది. ఎన్నికలు జరిగితే కూటమిలో మూడు పార్టీలకు వార్డులు కేటాయించాల్సి ఉంది. అధిష్టానం నిర్ణయం మేరకు ఈ విభజన జరిగితే అందరికి పెట్టుబడి పెట్టి గెలిపించుకోవాల్సిన బాధ్యత అధికార తెలుగుదేశం పార్టీపై ఉంటుంది. అధికార తెలుగుదేశం పార్టీలో ఇప్పటికే జనరల్ అయితే గత పదేళ్ళుగా బొజ్జలతో నడుస్తున్న భారత్‌గ్యాస్ ఏజెన్సీకి చెందిన విజయకుమార్ నాయుడు, ఇక బిసి అయితే సుధీర్‌రెడ్డి అడుగుజాడల్లో నడుస్తున్న దుర్గాప్రసాద్ ఆశిస్తున్నారు. ఇక వేళ చైర్మెన్ సీటును బిజెపికి వస్తే ఎవరు ముందుకు వస్తారు? జనరల్ అయితే ఎవరు ఉంటారు? అనే దిశగా పరిశీలనల్లో నాయకుడు తలమునకలై ఉన్నారు. ఏదీ ఏమైనా ఎన్నికలు జరిగితే ఈ మున్సిపాలిటిని చేజిక్కించుకోవాలనే దిశగా ప్రణాళికలు రచించుకుంటూ ముందుకు సాగుతున్నారు.

# నేషనల్ హైవే పక్కనే... భూముల ఆక్రమణలు

## - ప్రేక్షక పాత్రలో రెవెన్యూ అధికారులు - గ్రామస్తుల ఆరోపణలు



రొంపిచెర్ల, ఆగస్టు 29 ప్రభాతవార్త: మండల పరిధిలోని నేషనల్ హైవే రోడ్డు పక్కన ఉన్న ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురవుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. బండకిందపల్లె గ్రామ పంచాయతీలోని రోడ్డు పక్కనే ఉన్న సర్వే నంబర్ 86లో ప్రభుత్వ భూమి ఉన్నట్లు వారు తెలిపారు. హైవేకు సమీపంలోని భూముల ధరలు కోట్ల రూపాయల్లో పలుకుతుండటంతో ప్రభుత్వ భూములపై ఆక్రమణదారుల కన్ను పడుతోందని గ్రామస్తులు పేర్కొన్నారు. గతంలో ఇదే భూమిని పీలేరుకు చెందిన ఓ బడా నాయకుడు ఆక్రమించేందుకు ప్రయత్నించగా బండకిందపల్లె వీఆర్వో సురేంద్ర, రెవెన్యూ సిబ్బంది అడ్డుకున్నారని తెలిపారు. అయినప్పటికీ ఆక్రమణదారుడు అధికారులను లెక్కచేయకుండా సుమారు 36 సెంట్ల ప్రభుత్వ భూమిని ఆక్రమించి ఫెన్సింగ్ ఏర్పాటు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ ఘటనపై రొంపిచెర్ల పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసు కూడా నమోదు చేసినట్లు సమాచారం. అయితే ప్రస్తుతం అదే భూమిని తిరిగి ఆక్రమించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నా, స్థానికులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ చర్యలు తీసుకోవడం లేదని విమర్శిస్తున్నారు. కమ్మోళ్లపల్లె నుంచి రొంపిచెర్ల క్రాస్ రోడ్డు వరకు హైవే పక్కనే ఉన్న ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురవుతున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా కమ్మోళ్లపల్లె చెరువు కాలువను కూడా పూడ్చి ఆక్రమించారని రైతులు పేర్కొన్నారు. రెవెన్యూ సిబ్బంది ఆక్రమణదారులతో కుమ్మక్కై పట్టించుకోవడం లేదని ప్రజలు బహిరంగంగా విమర్శిస్తున్నారు. 24 గంటల్లోగా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోకపోతే సోమవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని గ్రామస్తులు హెచ్చరించారు. ఈ విషయమై తహసీల్దార్ కిరణ్ కుమార్‌ను వివరణ కోరగా, సర్వేయర్‌ను పంపించి పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# నేడు ఎన్ఇఇటి పిజీ-2026 రాత పరీక్ష

## - పక్కాగా పరీక్ష నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు - కలెక్టర్ సుమిత్‌కుమార్



చిత్తూరు, ఆగస్టు 29 ప్రభాతవార్త: జిల్లాలో ఆదివారం జరుగనున్న నీట్ పిజి-2026 రాత పరీక్ష పకడ్బందీగా నిర్వహించడానికి పక్కా ఏర్పాట్లు చేపట్టి పూర్తి చేసినట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. నీట్ పిజి రాత పరీక్ష ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా నిర్వహించడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టి పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. నీట్ పిజి రాత పరీక్ష నిర్వహణ ఏర్పాట్లపై కలెక్టర్ సుమిత్‌కుమార్ శనివారం అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో చిత్తూరు ఎస్వీ సెట్ కళాశాల, పలమనేరు మదర్ థెరిసా ఇంజనీరింగ్ కళాశాల, కుప్పం ఇంజనీరింగ్ కళాశాల, ద్రవిడ యూనివర్సిటీల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల్లో నీట్ పిజి-2026 రాత పరీక్షకు 594 మంది విద్యార్థులు హాజరు కానున్నారన్నారు. కంప్యూటర్ ఆధారిత విధానంలో ఈ పరీక్షలు జరుగనున్నాయని, ఈ పరీక్షను ఆదివారం ఉదయం నుండి మధ్యాహ్నం వరకు నిర్వహించనున్నారన్నారు. అభ్యర్థులను పరీక్షా కేంద్రాల్లోకి ఉదయం 7 గంటల నుండి అనుమతించడం జరుగుతుందన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద తగినంత పురుష, మహిళా పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేసి పరీక్షలకు హాజరు అయ్యే అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని పోలీసులను కలెక్టర్ ఆదేశించారు. అలాగే మినియేచర్ స్పై కెమెరాలు, కెమెరా కలిగిన కళ్ళద్దాలు, ఇయర్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ పరికరాలు, చిట్స్, నోట్స్, పేపర్లు తదితర నిషేధిత వస్తువులను పరీక్షా కేంద్రాల్లోని తీసుకురాకుండా కట్టుదిట్టమైన తనిఖీలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు ఇబ్బందులు లేకుండా చేరుకోవడానికి ఆర్టీసీ అవసరమైన మేరకు బస్సులను నడపాలని, పరీక్షల అనంతరం అభ్యర్థులు తమ గమ్యస్థానాలు చేరుకోవడానికి తిరుగు ప్రయాణానికి సైతం తగిన బస్సు సౌకర్యం కల్పించాలని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద శాంతిభద్రతలకు భంగం కలుగకుండా భారతీయ నాగరిక్ సురక్షా సంహిత, 2023లోని సెక్షన్ 163ను అమలు చేయడంతో పాటు పరీక్షా కేంద్రాలకు 200 మీటర్ల పరిధిలోని జెరాక్స్ కేంద్రాలు, నెట్ సెంటర్లను పరీక్షా సమయంలో మూసివేయించేలా తహసిల్దార్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే పరీక్షా కేంద్రాల్లో ఇంటర్నెట్ కనెక్టివిటీ సక్రమంగా వుండేలా కళాశాలల చీఫ్ సూపరిటెండెంట్లు ముందస్తు ఏర్పాట్లు చేయాలని, సంబంధిత అర్డీఓలు పరీక్షా కేంద్రాలను ముందుగానే పరిశీలించి అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

## విద్యార్థులకు స్కూల్ బ్యాగులు వితరణ



శాంతిపురం, ఆగస్టు 29 ప్రభాతవార్త: మండలంలోని పొన్నేపల్లి ప్రైమరీ స్కూల్‌లో చదువుతున్న 41మంది విద్యార్థులకు బెంగళూరులోని అక్విన్ ఒనిటీ సంస్థ ఉచితంగా బ్యాగులను పంపిణీ చేశారు. సంస్థ ప్రతినిధి అశ్వత్‌బాబు, వైకాపా జిల్లా ప్రధాన కార్యదరి ్శ కృష్ణమూర్తి, రమణప్ప, శ్రీరామప్ప, మణి పాల్గొన్నారు.

## ఘనంగా తెలుగుభాషా దినోత్సవం



శాంతిపురం, ఆగస్టు 29 ప్రభాతవార్త: మండలంలోని శ్రీపరమహంస యోగానంద విద్యాలయలో శనివారం తెలుగుభాషా, జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఆజాద్ హుసేన్, వైస్ ప్రిన్సిపాల్ పార్తీవులు, తెలుగు ఉపాధ్యాయులు ప్రతాప్, విశ్వనాథ్, సంతోష్‌కుమార్, నందిని హాజరై తెలుగుభాష ప్రాముఖ్యత, క్రీడలతో కలిగే ఆరోగ్యం గురించి వివరించారు. ప్రముఖ తెలుగు మహనీయులు రామూర్తి పంతులు, తెలుగుతల్లి, హరిదాసు, బుడబుక్కల, పిట్టల దొర వేషధారణలో విద్యార్థులు అలరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

### వివేకానంద పాఠశాలలో :

స్థానిక వివేకానంద పాఠశాలలో తెలుగుభాష, జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా జరిపారు. ఈసందర్భంగా విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి వచ్చి అలరించారు. ఉపాధ్యాయులు తెలుగుభాష, క్రీడల ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో అమ్ముమాలతి, సుబ్రమణ్యం, ఆనంద్, సరళ, రమేష్, మురళి పాల్గొన్నారు.

## బంగారుకుటుంబాలకు చేయూత



రామకుప్పం, ఆగస్టు 29 ప్రభాతవార్త: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాలతో పి4 కార్యక్రమంలో గుర్తించిన బంగారుకుటుంబాలకు మేఘా ఇంజనీరింగ్ సంస్థ ద్వారా సహకారం అందిస్తామని రెస్కోవైస్‌ఛైర్మన్ విశ్వనాథ్ పేర్కొన్నారు. శనివారం గొల్లపల్లి, కావలిమడుగు గ్రామాల్లో బంగారు కుటుంబాలుగా పలు నిరుపేద కుటుంబాలను గుర్తించారు. కార్యక్రమంలో మురుగేష్, రవికుమార్, ఆనందకుమార్, బంగారుమిత్రలు బాలకృష్ణ, పురుషోత్తం పాల్గొన్నారు.

## ఘనంగా తెలుగుభాషా దినోత్సవం



రామకుప్పం,ఆగస్టు29 ప్రభాతవార్త: తెలుగుభాషా దినోత్సవాన్ని మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. గ్రీన్ వా ్యలీ పబ్లిక్ స్కూల్‌లో తెలుగుభాష గొప్పతనం, మాతృభాష ప్రాధాన్యతను విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించారు. జ్యోతీశ్వర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అమరావతి చాంఫియన్‌షిప్‌లో ఫరాజ్‌కు గోల్డ్‌మెడల్



బైరెడ్డిపల్లి, ఆగస్టు29 ప్రభాతవార్త: తిరుపతిలో జరుగుతున్న అమరావతి చాంఫియన్‌షిప్ పోటీల్లో బైరెడ్డిపల్లికి చెందిన నౌషాద్ కుమారుడు ఫరాజ్ అండర్ -17 జావెలిన్‌త్రో విభాగంలో బంగారుపతకాన్ని సాధించాడు. శనివారం శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు చేతుల మీదుగా ఫరాజ్ బంగారుపతకాన్ని, నగదుబహుమతిని అందుకున్నాడు. రాష్ట్రస్థాయి పోటీల్లో ఫరాజ్ రాణించి బంగారుపతకం సాధించడంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ ఫరాజ్‌ను అభినందించారు.

## అపోలో నాలెడ్జ్ సిటీలో 2కే రన్

చిత్తూరుహెల్త్, ఆగస్టు 29 ప్రభాతవార్త:



జాతీయ క్రీడల దినోత్సవం పురస్కరించుకుని శనివారం తెల్లవారు జాము చిత్తూరు అపోలో నాలెడ్జ్ సిటీ ఆధ్వర్యంలో 2కే రన్ నిర్వహించారు. అపోలో నాలెడ్జ్ సిటీ గేటు వద్ద యూనిట్ హెడ్ ఎస్.బాలరాజ్ జెండా ఊపి 2కె రన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తి పెంపొందించడం, ఆరోగ్యంపై అవగాహన కల్పించడం లక్ష్యంగా ఈ 2కె రన్ నిర్వహించినట్లు తెలిపారు. విద్యార్థులు చదువులతో పాటు క్రీడలకు సైతం సమాన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. క్రీడలు శారీరక దృఢత్వంను పెంపొందించడమే కాకుండా మానసిక ఏకాగ్రతను పెంచి విద్యాభ్యాసంలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు దోహదపడుతాయన్నారు. ఇటీవల కాలంలో మారుతన్న జీవనశైలి, అసమతుల ఆహారపు అలవాట్ల కారణంగా దీర్ఘకాలిక వ్యాధులు పెరుగుతున్నాయని, ఈ పరిస్థితుల్లో ప్రతిరోజు శారీరక వ్యాయామం చేయడం అత్యవసరమన్నారు. ఈ కార్యక్రమంలో ఎకెసి డిజీఎం పి.రవికిరణ్, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ దిలీప్‌కుమార్, సుమలతతో పాటు అపోలో నాలెడ్జ్ సిటీ విద్యార్థులు, క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎన్‌ఇఇటి పిజీ పరీక్షా కేంద్రాల వద్ద...పటిష్ట బందోబస్తు : ఎస్పీ



చిత్తూరు, ఆగస్టు 29 ప్రభాతవార్త: జిల్లాలో ఆదివారం జరుగనున్న ఎన్‌ఇఇటి పిజీ పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తుషార్ డూడి పేర్కొన్నారు. జిల్లాలో చిత్తూరు ఎస్వీ సెట్ కళాశాల, పలమనేరు మదర్ థెరిసా కళాశాల, కుప్పంలో కుప్పం ఇంజనీరింగ్ కళాశాల, ద్రవిడ యూనివర్సిటీల్లో ఉదయం నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నీట్-పిజీ పరీక్ష జరుగనుందని, ఈ పరీక్షకు మొత్తం 594 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని ఎస్పీ తెలిపారు. విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా పరీక్షా కేంద్రాలకు చేరుకోవడానికి ట్రాఫిక్ నియంత్రణ చర్యలు తీసుకున్నామని, పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు అన్ని నియమ నిబంధనలను పాటిస్తూ ప్రశాంతంగా పరీక్ష రాయాలన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు నీట్ పిజి అడ్మిన్ కార్డు కలర్ ప్రింటవుట్‌ను తీసుకురావాలని, ఒక గంటకు ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని, అభ్యర్థులు ఏదేని ఒక గుర్తింపు కార్డు తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద సిసి కెమెరాల ద్వారా పర్యవేక్షణ జరుగుతుందని, ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.

## ఎస్ఐగా శ్రీకాంత్ బాధ్యతలు స్వీకరణ



పెనుమూరు, ఆగస్టు 29 ప్రభాతవార్త: పెనుమూరు పోలీస్ స్టేషన్ ఎస్ఐగా పి.శ్రీకాంత్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. కుప్పం నియోజకవర్గం గుడిపల్లి పోలీస్ స్టేషన్ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న పి.శ్రీకాంత్ పెనుమూరు ఎస్ఐగా బదిలీ కావడంతో ఆ మేరకు ఆయన శనివారం పోలీస్ స్టేషన్‌లో బాధ్యతలు తీసుకున్నారు. అలాగే పెనుమూరులో విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ శ్రీనివాసులు గుడిపల్లి పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. నూతన ఎస్ఐ శ్రీకాంత్ ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరు సహకారం అందించాలని, ప్రతి ఒక్కరు పక్కాగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్లు వినియోగించాలన్నారు. ఎవరైనా ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ శ్రీకాంత్ హెచ్చరించారు.

## కుప్పంలో నీట్ పిజి ఎంట్రెన్స్ పరీక్షలకు రెండు కేంద్రాలు

**కుప్పం, ఆగస్టు 29 ప్రభాతవార్త:** నీట్ పి.జి. పరీక్షలకు కుప్పంలో ఉన్నతాధికారులు రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. కుప్పం ద్రవిడ విశ్వవిద్యాలయం, కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్‌లలో ఈ పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ద్రవిడ వర్సిటీలో ఎనభైమంది, కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్‌లో 214మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నారు.

## విజయం పాఠశాలలో గిడుగు జయంతి వేడుకలు

చిత్తూరురూరల్, ఆగస్టు 29 ప్రభాతవార్త:



చిత్తూరుపట్టణం, సుందరరాజపురం లోని విజయం పాఠశాల నందు గిడుగు వెంకర రామమూర్తి 153వ జయంతి వేడుకలను విజయం విద్యాసంస్థల అధినేత డా.ఎం, తేజోమూర్తి, అకడమిక్ డైరెక్టరు డా. శైలజ తేజోమూర్తి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైన కార్యక్రమంలో డా.తేజోమూర్తి, డా.శైలజలు మాట్లా డుతూ పిల్లలందరూ తెలుగుభాష ఔన్నత్యాన్ని చాటేలా గిడుగువారిని స్ఫూర్తిగా తీసుకోవాలని కోరుతూ గిడుగు వ్యావహారిక భాష కోసం ఆయన చేసిన సేవలను కొనియాడారు. అనంతరం విద్యార్థులు వివిధ తెలుగు కవుల వేషధారణలో వచ్చి అందరినీ ఆకట్టుకొన్నారు. ప్రధానోపాధ్యాయురాలు డా. శ్రీదేవి, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## 31న కలెక్టరేట్‌కు రజకులందరూ తరలిరండి

చిత్తూరురూరల్, ఆగస్టు 29 ప్రభాతవార్త:



ఆంధ్రరాష్ట్రంలో రజకులను ఎస్సీలుగా గుర్తించాలని, ప్రభుత్వం ఇచ్చిన హామిలను అమలు చేయాలని కోరుతూ ఈనెల 31 సోమవారం తలపెట్టనున్న కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రాష్ట్ర రజక ఎస్సీ సాధన కమిటీ కోర్ కమిటీ సభ్యులు పి షణ్ముగం కోరారు. జిల్లా కలెక్టరుకు ఇవ్వనున్న వినతిపత్రంకు జిల్లాలోని ఏడు నియోజకవర్గాల నుంచి రజక వృత్తిదారులు, మేధావులు అందరూ పాల్గొనాలని ఆయన కోరారు.

## విద్యా ప్రస్థాన వేడుకలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం

పలమనేరు రూరల్, ఆగస్టు 29 ప్రభాతవార్త:



పలమనేరు మండలంలోని మండిపేట కోటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వచ్చే నెల 6న జరగనున్న విద్యా ప్రస్థాన (రూబీ జూబ్లీ వేడుక) వేడుకలకు విచ్చేయాలని నిర్వహకులు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డిని ఆహ్వానించారు. పలమనేరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యేను కలసిన ఆ పాఠశాల పూర్వపు విద్యార్థులు మరియు గ్రామస్థులు ఎమ్మెల్యేను కలసి ఆహ్వానించారు. మండిపేట కోటూరు నందు జిల్లా పరిషత్ హైస్కూల్ ఏర్పాటు కాబడి 40 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ వేడుకలు నిర్వహిస్తున్నట్లు వారి పేర్కొన్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థుల సమావేశము, ఉపాధ్యాయుల సత్కారం, సాంస్కృతి కార్యక్రమాలతో పాటు పాఠశాల అభివృద్ధి కార్యక్రమాలు మరియు ప్రత్యేక అతిథుల ప్రసంగాలతో పాటు పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వారు తెలియజేసారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేయాలని వారు ఆయన్ను కోరారు. ఈ కార్యక్రమంలో బాలాజీ కోఆపరేటివ్ సూపర్ బజార్ అధ్యక్షులు ఆర్వీ బాలాజీ, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు జగదీష్ నాయుడు, మోహన్, చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

## త్రోబాల్ ఉమెన్ లీగ్ విజేతలుగా... పిజి ఆర్ట్స్ విద్యార్థినులు

కుప్పం, ఆగస్టు 29 ప్రభాతవార్త:



జాతీయ క్రీడా దినోత్సవంను పురస్కరించుకుని ద్రవిడ వర్సిటీలో ఈనెల 25నుంచి నిర ్వహించిన ద్రవి డియన్ త్రోబాల్ ఉమెన్ లీగ్ 2026 పోటీలు శనివారం ముగిశాయి. ఈ టోర్నీ విజేతలుగా పిజి ఆర్ట్స్ విద్యా ర్థినులు నిలవగా కెప్టెన్ సుప్రియ మెడల్స్ స్వీకరించారు. అలాగే రన్నర్లుగా ఎంబిఎ విద్యార్థినులు నిలవగా కెప్టెన్ జోత్స్న, మూడో స్థానం లో బిఇడి విద్యార్థులు నిలవగా జట్టు తరపున జాహ్నవి మెడల్స్ అందుకున్నారు. విజేతలకు ఉపకులపతి ఆచార్య ఎంసి మల్లయ్య బహుమతులు అందించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కిరణ్‌కుమార్, డీన్ ఆచార్య యశోద, హెచ్ఒడి ఆచార్య విజయవర్ధిని, పిటిఐ నవీన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

## గౌరవ డాక్టరేట్ అందుకున్న సయ్యద్ అక్రమ్



కుప్పం, ఆగస్టు 29 ప్రభాతవార్త: జర్నలిస్టు రంగంలో అందిస్తున్న సేవలను గుర్తించి కుప్పంకు చెందిన సీనియర్ జర్నలిస్టు సయ్యద్ అక్రమ్‌కు యునైటెడ్ అమెరికన్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. శనివారం పుదుచ్చేరిలో జరిగిన సోషల్ లీడర్స్ అండ్ విజనరీస్ కాన్‌క్లేవ్ -2026 కార్యక్రమంలో వైస్ చాన్సలర్ ఆచార్య అమృతవలు, ఫౌండర్ మరియు డైరెక్టర్ డాక్టర్ వెంకటేషన్ చేతుల మీదుగా అక్రమ్ డాక్టరేట్‌ను అందుకున్నారు. వి.కోట, కుప్పంలలో అక్రమ్ పాతికేళ్లుగా జర్నలిస్టుగా పనిచేస్తున్నారు. గౌరవ డాక్టరేట్ అందుకున్న అక్రమ్‌ను పలువురు స్థానికులు, జర్నలిస్టులు అభినందించారు.

## కెఇసిలో బిటెక్, ఎంబిఎ సెమిస్టర్ ఫలితాలు విడుదల



కుప్పం, ఆగస్టు 29 ప్రభాతవార్త: కుప్పం ఇంజనీరింగ్ కళాశాల (అటానమస్)లో గత జూన్ నెలలో నిర్వహించిన బిటెక్, ఎంబిఎ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను శనివారం అనంతపురం జెఎన్‌టియు పరీక్షల పరిశీలకులు డాక్టర్ చిత్ర, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్ బాబు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ భాస్కరన్, హెచ్ఒడిలు మాధవన్, మునీంద్ర, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ సోమసుందరం విడుదల చేశారు. ఈసందర్భంగా బిసిఎన్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ బిసి నాగరాజ్ మాట్లాడుతూ సెమిస్టర్ పరీక్షల ఫలితాల్లో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచడం పట్ల విద్యార్థులను అభినందించారు. కాగా పరీక్షా ఫలితాల్లో బిటెక్ సెకండ్ సెమిస్టర్‌లో సిఎస్ఇలో శ్రేయ 94శాతం మార్కులు, మౌనిక 91.6శాతం మార్కులు, చిత్ర 94.8శాతం మార్కులు సాధించారు. అలాగే ఎంబిఎ సెకండ్ సెమిస్టర్‌లో మాధవి 85.85శాతం మార్కులు, దివ్యశ్రీ 85.38శాతం, అక్షయ 84.88శాతం మార్కులతో టాపర్లుగా నిలిచారు. ఈసందర్భంగా విద్యార్థులను ఛైర్మన్ డాక్టర్ బిసి నాగరాజ్, వైస్ ఛైర్మన్ డాక్టర్ సునీల్ రాజ్, సెక్రటరీ సాగర్ రాజ్ అభినందించారు.

## ఘనంగా తెలుగుభాషా దినోత్సవ వేడుకలు



కుప్పం, ఆగస్టు 29 ప్రభాతవార్త: మున్సిపల్ పరిధి సామగుట్టపల్లి జడ్పీ హైస్కూల్‌లో శనివారం శ్రీ గిడుగు వెంకటరామూర్తి పంతులు జయంతి సందర్భంగా తెలుగుభాషా దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం మంజునాథ గుప్తా అధ్వర్యంలో ప్రత్యేక సమావేశం జరిపారు. తెలుగు ఉపాధ్యాయులు గాలి సురేష్ మాట్లాడుతూ రామూర్తి పంతులు ప్రజలు మాట్లాడే భాషనే అధికారిక భాషగా వ్యవహరించేందుకై కృషి చేశారన్నారు. సవర తెగ వారికి పదజాల భాషకోశాన్ని అభివృద్ధి చేశారన్నారు. దేశంలోనే భాషల్లో కెల్లా తెలుగుభాష ప్రత్యేక మైందన్నారు. అనంతరం వకృత్వ, వ్యాసరచన, పద్యాల పోటీల్లో గెలిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో విజయనిర్మల, కిరణ్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నాణ్యమైన విద్యుత్ సేవలు అందించాలి

– రెస్కోఛైర్మన్ ప్రతాప్‌కుమార్



శాంతిపురం,ఆగస్టు29 ప్రభాతవార్త: రైతులు, వినియోగదారులకు అధికారులు నాణ్యమైన విద్యుత్ సేవలు అందించాలని కుప్పం రెస్కో ఛైర్మన్ ప్రతాప్‌కుమార్ సూచించారు. శనివారం మండలంలోని కాకర్లవంక, బడుగుమాకులపల్లి గ్రామంలో ఆయన పర్యటించారు. కాకర్లవంక గ్రామంలో రహదారి పక్కన ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉన్న విషయాన్ని ఛైర్మన్ దృష్టికి గ్రామస్తులు తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన ఆయన ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని వెంటనే ట్రాన్స్‌ఫార్మర్ మార్పుకు అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో లూజ్‌లైన్లు, దెబ్బతిన్న విద్యుత్ స్థంభాలు ప్రమాదకరంగా ఉంటే వెంటనే వాటిని గుర్తించి మార్చాలని సూచించారు. ప్రజలు కూడా విద్యుత్ సమస్యలపై 1912నెంబరుకు సమాచారం అందించవచ్చున్నారు. కార్యక్రమంలో రెస్కో డైరెక్టర్లు

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు పలమనేరు, కుప్పం,

## గణనాధుని దర్శించుకున్న ఏపీ హైకోర్టు న్యాయమూర్తి

కాణిపాకం, ఆగస్టు 29 ప్రభాతవార్త:



ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట స్యోతిర్మయి శనివారం కుటుంబసమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాలొ ్గన్నారు. అలాగే వారు శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు.వారికి వేదమంపడపంలో వేద పండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ సూపరెండెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్స్పెక్టర్ బాలాజినాయుడు, కాణిపాకం ఎస్సై నరసింహులు, ఐరాల తహశీల్దార్ రామకృష్ణ,చిత్తూరు కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రేపు కాణిపాకంలో సంకటహర గణపతివ్రతం

కాణిపాకం, ఆగస్టు 29 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో సోమవారం సంకటహర గణపతివ్రతంను నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్ తెలిపారు. ఈమేరకు ప్రతినెలా పౌర్ణమి అనంతరం వచ్చే చతుర్థి రోజున ఈవ్రతాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈమేరకు సోమవారం ఉదయం 9,11,గంటలకు, సాయంత్రం 3, 5 గంటలకు జరిగే ఈవ్రతంలో భక్తులు 500 రూపాయలు టిక్కెట్ చెల్లించి గోత్రనామాలతో ప్రత్యక్షంగా కాని, పరోక్షంగా కాని పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఈఓ కోరారు.అలాగే రాత్రి 7 గంటల నుండి 8 గంటల వరకు స్వామివారికి స్వర్ధరథోత్సవం జరుగుతుందని ఆయన తెలిపారు.

### 4న కాణిపాకంలో శ్రీకృష్ణాష్టమి గోపూజ

కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామివారి దేవస్థానంలో సెప్టెంబర్ 4న దేవస్థానం గోశాల నందు శ్రీకృష్ణాష్టమి సందర్భంగా గోపూజ కార్యక్రమం నిర ్వహించనున్నట్లు ఆలయ ఈఓ పెంచల కిషోర్ తెలిపారు. స్థానిక దేవస్థానం గోశాలలో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 10 గంటల వరకు గోపూజ కార్యక్రమంను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈకార్యకమంలో , ఆలయ ఉభయదారులు, కాణిపాకం పరిసర గ్రామాలకు భక్తులు పెద్దఎత్తున పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

## ఘనంగా మాతృభాషా దినోత్సవం

తవణంపల్లె, ఆగస్టు 29 ప్రభాతవార్త:



మండలంలోని తొడతర జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం మాతృ భాషా దినోత్సవం, క్రీడాదినోత్సవంను అత్యంత ఘనంగా నిర్వహించారు పాఠశాల హెచ్ఎం హెచ్.ఖాతూంబీ ఆధ్వర్యంలో ఈకార్యమ్రాన్ని నిర్వహించారు. ఈసందర్బంగా హెచ్ఎం మాట్లాడుతూ విద్యార్థి సంపూర్ణ వ్యక్తిత్వాన్ని పెంపొందించేది మాతృభాషా క్రీడలని తెలిపారు. ప్రతి విద్యార్థి పుస్తక పఠనాన్ని అలవాటుగా మార్చుకోవాలని సూచించారు. అలాగే తెలుగు ఉపాధ్యాయుడు పి.కనకసభాపతి మాట్లాడుతూ భాష ఒక జాతికి ఆత్మ అని అలాంటి తెలుగు భాషాభివృద్ధికి గిడుగు రామమూర్తిపంతులు త్యాగం చేసి వ్యావహారిక భాషాద్యోమ పితామహుడుగా కార్తించబడుతున్నారని తెలిపారు. అలాగే విద్యార్థులు మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో అవసరమని అన్నారు. ఈసందర్భంగా విద్యార్థులకు వ్యాస రచన, పద్యపఠన పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు.ఈకార్యమ్రంలో వ్యాయామ ఉపాధ్యాయుడు సిద్దిక్, ఉపాధ్యాయులు విజయభాస్కర్‌రెడ్డి, వెంకటరమణ,భార్గవి తదితరులు పాల్గొన్నారు.

## హోటల్‌లోని ఆహారపదార్థలను తనిఖీచేసిన అధికారులు

పలమనేరు. ఆగస్టు 29 ప్రభాతవార్త: పలమనేరు ఎంబిటి రోడ్డులో బస్ స్టాఫ్ వద్ద గల ఓ హోటల్ పై శనివారం మధ్యాహ్నం మున్సిపల్ అధికారులు దాడులు నిర్వహించారు. సుమారు 25 కేజీల కుళ్ళిన మాంసం, 30 కేజీల పురుగులు పడ్డ చికెన్ మరో 20 కేజీల చేపలు స్వాదీ.నం చేసుకున్నారు. వారంరోజులుగా వీటిని ఫ్రిజ్‌లో నిల్వచేసి కూరలు వండుతున్నారు. బస్ స్టాఫ్ కావడంతో ఎంతోమంది భోజన సమయానికి హోటల్‌కు వస్తుంటారు. ఈ నేపథ్యంలో శనివారం మధ్యాహ్నం హోటల్‌కు వచ్చిన వారు కుళ్ళిన మాంసం ఉన్నట్లు గుర్తించారు. వెంటనే మున్సిపల్ అధికారులకు తెలియజేయడంతో హోటల్ పై దాడులు చేశారు. కుళ్ళిన మాంసం చికెన్ చేపలు స్వాధీనం చేసుకుని హోటల్ యజమానిపై కేసులు నమోదు చేశారు. పలమనేరు నుండి దూరప్రాంతాలకు వెళ్లడానికి ఎంతో మంది వస్తుంటారు. కుళ్ళిన మాంసంతో బిరియానీలు ఇతర వంటకాలతో ప్రజలను మోసగిస్తున్నారు. ఇలాంటి వారిపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

## క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం

– ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్



చిత్తూరురూరల్, ఆగస్టు 29 ప్రభాతవార్త: క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందని, మీకు నచ్చిన క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ తెలలిపారు. జాతీయ క్రీడా దినోత్సవంను పురస్కరించుకొని శనివారం చిత్తూరు డిస్టిక్ ఒలంపిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పిసిఆర్ సర్కిల్ నుంచి ఎమ్మెస్సార్ సర్కిల్, చర్చివీధి మీదుగా నిర్వహించిన ర్యాలీ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్య ఇస్తోందన్నారు. క్రీడల్లో రాణించిన విద్యార్థులను సత్కరించారు. అంతకుముందు మేజర్ ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డిఈవో లక్ష్మీనారాయణ, చుడా ఛైర్‌పర్సన్ కఠారిహేమలత, చిత్తూరు జిల్లా ఒలంపిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర్, నాయకులు జయప్రకాష్, రాజేష్‌కుమార్‌రెడ్డి, సతీష్, రవీంద్రనాయుడు, యువరాజులు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్చరీ క్రీడాకారుడు అజయ్‌రెడ్డికి ప్రశంసల వెల్లువ



చిత్తూరురూరల్, ఆగస్టు 29 ప్రభాతవార్త: చిత్తూరుపట్టణం, బివి రెడ్డి పాఠశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న వై అజయ్‌రెడ్డి సౌత్ జోన్ అండర్ 19 ఆర్చరీ పోటీల్లో ఛాంపియన్ షిప్ కైవసం అందుకోవడం హర్షణీయమని అడిషనల్ ఎస్పీ రాజశేఖర్‌రాజు కొనియాడారు. శనివారం పాఠశాల నందు జరిగిన వార్షిక క్రీడాదినోత్సవంకు ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. కర్నూలులో జరిగిన సిబిఎస్ఈ సౌత్‌జోన్ అండర్ 19 ఆర్చరీ ఇండియన్ రౌండ్ 40 మీటర్లు, 30 మీటర్ల విభాగంలో అజయ్‌రెడ్డి 520 పాయింట్లు సాధించి స్వర్ణ పతాకాన్ని అందుకోవడం ఆనందదాయకమన్నారు. అనంతరం ట్రోపిని అందజేస్తూ జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతులు సాధించాలని అజయ్‌ను ఆయన కోరారు. కార్యక్రమంలో పాఠశాల నిర్వా హకురాలు సామినిరెడ్డి, అడ్మిని స్ట్రేటర్ బెంజిమెన్, ప్రిన్సిపల్ కౌసల్య, ఆర్చరీ శిక్షకుడు ధనంజయ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలతో శారీరక...మానసికోల్లాసం:అర్బన్ సిఐ



కుప్పం, ఆగస్టు 29 ప్రభాతవార్త: విద్యార్థులకు క్రీడలతో శారీరక, మానసికోల్లాసం సాధ్యమవుతుందని అర్బన్ సిఐ సయ్యద్ హాషం పేర్కొన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా విద్యార్థులు చేపట్టిన ర్యాలీని సిఐ ప్రారంభించారు. మాట్లా డుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే విద్య, క్రీడలపై మక్కువ చూపాలని జీవితంలో ఉన్నత లక్ష్యాల దిశగా అడుగులు వేయాలని సూచించారు. చెడు అలవాట్లకు దూర ంగా ఉండాలన్నారు. ఆరోగ్యమే అసలైన సంపద అని పేర్కొన్నారు. కార్యక్రమంలోలయన్స్‌క్లబ్‌జిల్లాఛైర్మన్‌మహేష్,మాజీఎంపిపిడాక్టర్‌వెంకటేష్, ఉపాధ్యాయులు

# తిరుపతి డివిజన్

## పక్కా కార్యాచరణపై పార్టీ బలోపేతంకు చర్యలు

### – జిల్లా పార్టీ కార్యాలయ నిర్మాణ పనులను పరిశీలించిన మంత్రి మండిపల్లి



**చిత్తూరు, ఆగస్టు 29 ప్రభాతవార్త:** ఓ వైపు ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ మరో వైపు క్షేత్ర స్థాయి నుండి తెలుగుదేశం పార్టీని పక్కా కార్యాచరణతో బలోపేతం చేయడానికి కార్యకర్త స్థాయి నుండిపై స్థాయి నాయకుల వరకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రవాణా శాఖ, యువజన క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి శనివారం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చెక్కుడుకుప్పం షణ్ముగంరెడ్డి, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడుతో కలిసి చిత్తూరు ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయ నిర్మాణ పనులను పరిశీలించారు. జిల్లా పార్టీ కార్యాలయ ప్రాంగణంకు వచ్చిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి నాయకులు, కార్యకర్తలు స్వాగతం తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి జిల్లా పార్టీ కార్యాలయ నిర్మాణ పనులు పరిశీలించి, భవనంలో నిర్మిస్తున్న వివిధ విభాగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలో మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో తెలుగుదేశం పార్టీని మరింత బలోపేతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. త్వరలో స్థానిక సంస్థలకు ఎన్నికలు జరుగనుండటంతో నాయకులు, కార్యకర్తలు కలసికట్టుగా పార్టీ బలపరిచే అభ్యర్థులను గెలిపించుకుని క్షేత్ర స్థాయిలో పార్టీకి వున్న సత్తాను అదరికి చాటి చెప్పాలని మంత్రి పిలుపునిచ్చారు. జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయం ద్వారా ప్రజలకు మరింత చేరువ కావాలని నాయకులకు మంత్రి సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి సునీల్‌కుమార్ చౌదరి, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, తెలుగుదేశం సీనియర్ నాయకులు కాజూరు బాలాజీ తదితరుల పాల్గొన్నారు.

## రాష్ట్ర ఖోఖో విజేత చిత్తూరు



**బంగారుపాళ్యం, ఆగస్టు 29 ప్రభాతవార్త:** గత ఐదు రోజులుగా తిరుపతి జిల్లాలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో చిత్తూరు జిల్లా గెలుపొంది ప్రథమ స్థానం సాధించింది. రాష్ట్ర ప్రభుత్వం అమరావతి క్రీడా పోటీల పేరుతో క్రీడలను నిర్వహించింది. మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిల్లో గెలుపొందిన జట్లు రాష్ట్ర స్థాయిలో పోటీలు నిర్వహించింది. తిరుపతి నగరంలో రాష్ట్ర స్థాయి అమరావతి ఖోఖో పోటీలను చేపట్టగా వివిధ జిల్లాల నుండి జట్లు పాల్గొన్నారు. ఈ పోటీల్లో చిత్తూరు జిల్లా బాలికలు-17 విభాగంలో విజయనగరం జిల్లాపై విజయం సాధించి ప్రథమ సాధించింది. శనివారం తిరుపతి నగరం నందు శాసనసభ స్పీకర్ అన్నయ్యపాత్రుడు, రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, రాష్ట్ర స్పోర్ట్స్ ఆథారిటీ ఛైర్మన్ రవినాయుడు చేతుల మీదుగా జట్టు కప్పును అదుకుంది. చిత్తూరు జిల్లా బాలిక విభాగం జట్టులో బంగారుపాళ్యం మండలానికి చెందిన 8 మంది క్రీడాకారులు పాల్గొనడం గర్వకారణం.

## చౌక దుకాణాల్లో క్యూఆర్ కోడ్ తొలగింపు



**బంగారుపాళ్యం, ఆగస్టు 29 ప్రభాతవార్త:** ప్రభుత్వ చౌకదుకాణాల్లో ప్రవేశపెట్టిన క్యూఆర్ కోడ్‌ను తొలగించాలని మండల పరిధిలోని చౌకదుకాణ డీలర్లు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక తహసిల్దారు కార్యాలయం ఎదుట చౌక దుకాణ డీలర్లు నిరసన తెలిపి తహసిల్దారు షబ్బీర్‌భాషాకు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన క్యూఆర్ కోడ్ వల్ల డీలర్లకు పని భారం ఎక్కువ అవుతున్నారు. చౌకదుకాణంకు వచ్చే ప్రజలకు సకాలంలో వస్తువులు అందించలేక పోతామని తెలిపారు. గోడౌన్ స్టాక్ పాయింట్‌లో ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్‌లను ప్రభుత్వం రద్దు చేసిందని, ఆదే తరహాలో చౌక దుకాణాల్లో సైతం క్యూఆర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరారు. ఈ సమావేశంలో మండల డీలర్ల సంఘ అధ్యక్షులు సధాకర్‌రెడ్డి, డీలర్లు ప్రసాద్, రఘు, మురళీ, నాగేశ్వరరావు, కోదండ, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## మేయర్ కుర్చీకి రిజర్వేషనే కీలకం!

**చిత్తూరు, ఆగస్టు 29 ప్రభాతవార్త:** మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం ముహుర్తం సిద్ధం చేస్తుండటంతో చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కుర్చీ కోసం ఆశలు పెట్టుకున్న ఆశావాహుల సంఖ్య పెరుగుతుంది. మేయర్ కుర్చీ కోసం ప్రస్తుతం జరుగనున్న ఎన్నికల్లో మేయర్ కుర్చీ ఏ వర్గానికి రిజర్వ్ అవుతుందనే విషయంపై సర్వత్రా ఉత్కంఠత నెలకొంది. ఈ సారి జరిగే మున్సిపల్ ఎన్నికల్లో మేయర్ కుర్చీ తమ సామాజిక వర్గానికి చెందిన వారికే కేటాయింపు వుంటుందని భావించిన పలువురు నాయకులు ఆ మేరకు ఎన్నికల్లో పోటీ చేయడానికి ముమ్మరంగా ప్రయత్నాలు ప్రారంభించారు. చిత్తూరు నగర మేయర్ కుర్చీ ఏ వర్గానికి రిజర్వ్ అయినప్పటికీ ఎన్నికల్లో పోటీ మాత్రం కచ్చితంగా చేయాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ ఇప్పటికే నిర్ణయించింది. ఇటు అధికార తెలుగుదేశం పార్టీ తరపున మేయర్ కుర్చీ ఓసీ జనర్‌కు రిజర్వ్ అయితే పోటీలో తాను వుంటానని సీనియర్ తెలుగుదేశం నాయకులు, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ కాజూరు బాలాజీ ఇప్పటికే ప్రచార బరిలో దిగారు. ఇటీవల తనకు బాగా పట్టు వున్న కాజూరులో మెగా హెల్త్ క్యాంపు నిర్వహించి ప్రజల్లోకి వెళ్ళే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మేయర్ కుర్చీ ఓసీ మహిళకు రిజర్వ్ అయితే తనకు అవకాశం ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే సికె బాబు సతీమణి సికె లావణ్యబాబు పార్టీ అధిష్ఠాంను ఇప్పటికే కోరినట్లు ప్రచారం జరుగుతుంది. ఇక వైకాపా తరపున మేయర్ కుర్చీ ఓసీ జనరల్ లేదా ఓసీ మహిళకు రిజర్వ్ అయితే ఈ కోటాలో వైకాపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎంసి విజయానందరెడ్డి సతీమణిని మేయర్ ఎన్నికల బరిలో నిలపాలని ఆయన భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతుంది. అలాగే మేయర్ కుర్చీ బిసీ జనరల్‌కు కేటాయిస్తే తనకు అవకాశం లభిస్తుందని సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు రావూరి ఈశ్వర్‌రావు ఆశలు పెట్టుకున్నారు. అలాగే వైకాపా తరపున మాజీ డిప్యుటీ మేయర్ ఆర్.చంద్రశేఖర్‌తో పాటు బిసీ నాయకులు జ్ఞానజగదీష్‌లు పోటీ చేయడానికి రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఈ పరిస్థితుల్లో మేయర్ కుర్చీ ఏ వర్గానికి రిజర్వ్ అవుతుందనే విషయంపై సర్వత్రా ఉత్కంఠత నెలకొంది.

## పాతకాల్వలో రీసర్వేపై రైతులతో గ్రామ సభ....

### ..తేడాలపై ఫిర్యాదులు – తిరిగి సర్వేకు అధికారులు హామీ..




**తిరుపతి రూరల్, ఆగస్టు 29:** తిరుపతి రూరల్ మండలం పాత కాల్వ గ్రామంలో రీసర్వే ప్రక్రియపై నెలకొన్న సందేహాలు, భూముల విస్తీర్ణ తేడాల అంశంపై అధికారులు గ్రామ సభ నిర్వహించారు. గతంలో నిర్వహించిన రీసర్వేలో కొంతమంది రైతులు తమ భూముల పరిమాణంలో తేడాలు ఉన్నాయని, జాయింట్ ఎల్‌పీఎంఎస్ నమోదులు ఉన్నాయని పేర్కొంటూ పట్టాదారు పాసుపుస్తకాలు స్వీకరించేందుకు నిరాకరించిన నేపథ్యంలో ఈ సమావేశం ఏర్పాటు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ డివిజనల్ అధికారి బి. రామమోహన్ ఆధ్వర్యంలో జరిగిన గ్రామ సభలో రైతులకు రీసర్వే విధానాలు, భూమి రికార్డుల ప్రాముఖ్యతపై సమగ్ర అవగాహన కల్పించారు. తమ భూముల విస్తీర్ణం, సరిహద్దులు లేదా ఇతర అంశాలపై సమస్యలు ఉన్న రైతుల భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అవసరమైతే తిరిగి సర్వే నిర్వహించి సమస్యలను పరిష్కరిస్తామని ఆర్డీఓ హామీ ఇచ్చారు. రైతులు అపోహలకు గురికాకుండా తమ సమస్యలను నేరుగా రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. సోమవారం నుంచి సమస్యలు ఉన్న భూములపై మళ్లీ సర్వే చేపడతామని, అక్టోబర్ నాటికి పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు కె. జనార్దన్ రాజు, రీసర్వే డిప్యూటీ తహశీల్దారు ఎం. మోహన్ బాబు, మండల సర్వేయర్ హేమకుమార్, వీఆర్వో కె. శివప్రసాద్, గ్రామ సర్వేయర్ హర్షతో పాటు రైతులు పాల్గొన్నారు.

## సోషల్ వర్క్ ఎకనామిక్స్‌పై అవగాహన



**తిరుపతి,ఆగస్టు 29ప్రభాతవార్త:** పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం లో భారతీయ జ్ఞాన వ్యవస్థలు-సామాజిక సేవపై జాతీయ సదస్సుపై అవగాహన జరిగింది. విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య వెన్నం ఉమ ,ఆచార్య కె. జి. పరశురామ, సోషల్ వర్క్ విభాగాధిపతి ఆచార్య కె. అనురాధ, సోషల్ సైన్సెస్ డీన్ ఆచార్య పి. విజయలక్ష్మి ృ సదస్సులో పూర్వ విద్యార్థినులు పాల్గొన్నారు.

## జగన్‌రెడ్డి చెప్పేది అబద్ధాలే!



**తొట్టంబేడు, ఆగస్టు 29 ప్రభాతవార్త:** వాస్త వాలకు విరుద్ధంగా ప్రవర్తిస్తూ అసత్య ప్రచారాలు చేసే జగన్ రెడ్డికి తెలిసింది అబద్ధాలు చెప్పడమేనని తెలుగుదేశం పార్టీ బీసీ విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎం.ఉమేష్ రావు ఆరోపించారు. ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా శనివారం తొట్టంబేడు మండలం కొత్తూరు గ్రామంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వ రెండేళ్ల సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉమేష్ రావు మాట్లాడుతూ 2019లో బూటకపు హామీలతో అధికారంలోకి వచ్చిన జగన్ రెడ్డి ఇచ్చిన హామీల్లో 85 శాతం ఎగనామం పెట్టారని విమర్శించారు. పంచాయతీ రాజ్ చట్ట సవరణ చేయకపోవడం వల్లనే 34 శాతం రిజర్వేషన్ జీవో కోర్టులో కొట్టివేయబడిందని, దీంతో 17 వేల మంది బీసీలకు రాజ్యాంగబద్ధ పదవులు దూరమయ్యాయని, బీసీ సబ్ ప్లాన్ నిధులు రూ.1.27 లక్షల కోట్లు దారి మళ్లించి బీసీలకు ద్రోహం చేశారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో బీమాల భాస్కర్, చిల్లకూరు మణి, కోట చంద్రశేఖర్, నాయకులు వెంకటేశ్వర్లు, భూపాల్, వెంకటేష్, గురుమూర్తి, ముని, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

## పొయ్యి కొత్తూరు గ్రామంలో విషాద ఛాయలు



**తొట్టంబేడు,ఆగస్టు 29 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తి నియోజకవర్గంలో విషాదం చోటు చేసుకుంది. తొట్టంబేడు మండలం పొయ్యి కొత్తూరు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు మదన్ మోహన్ నాయుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఆయన మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. పని నిమిత్తం మదన్ మోహన్ నాయుడు మోటార్ సైకిల్ పై తిరుపతికి వెళుతుండగా మార్గమధ్యంలో ముందు వెళుతున్న అంబులెన్స్ ను దాటబోయి అదుపు తప్పి కిందపడ్డారు. ఈ ప్రమాదంలో ఆయన తలకు, శరీరానికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌లో తిరుపతిలోని బాలాజీ హాస్పిటల్ కు తరలించారు. అక్కడ వైద్యులు ఎంత ప్రయ త్నించినా ఫలితం లేకపోయింది. మృత్యువుతో పోరాడి తుదిశ్వాస విడిచారు. ఆసుపత్రి నుండి ఆయన భౌతికకాయాన్ని స్వగ్రామమైన పొయ్యి కొత్తూరుకు తీసుకురాగా, పెద్ద ఎత్తున గ్రామస్తులు, టీడీపీ శ్రేణులు తరలివచ్చి కన్నీటితో వీడ్కోలు పలికారు. విషయం తెలుసుకున్న టీడీపీ రాష్ట్ర మాజీ కార్యదర్శి గాలి చలపతి నాయుడు, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు గాలి మురళి నాయుడు హుటాహుటిన గ్రామా నికి చేరుకుని మదన్ మోహన్ నాయుడు భౌతికకాయంపై పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు.

***పార్టీకి తీరని లోటు: గాలి బ్రదర్స్*** ఈ సందర్భంగా గాలి బ్రదర్స్ మాట్లాడుతూ మదన్ మోహన్ నాయుడు లాంటి నిబద్ధత కలిగిన కార్యకర్తను కోల్పోవడం పార్టీకి తీరని లోటని అన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి ఆయన క్రియాశీలకంగా పనిచేశారని కొనియాడారు. బాధిత కుటుంబానికి తెలుగుదేశం పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ విషాద వార్తను శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వ పరంగా, పార్టీ పరంగా తగిన సహాయ సహకారాలు అందించేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

## అమరావతి ఛాంపియన్ షిప్‌లో...

### శ్రీకాళహస్తి వాసి బంగారు పతకం



**శ్రీకాళహస్తి, ఆగస్టు 29 ప్రభాతవార్త:** తిరుపతిలో శనివారం జరిగిన అమరావతి ఛాంపియన్ షిప్ ముగింపు వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ అయ్యన్న పాత్రుడు, రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి ఎం. రాంప్రసాద్ రెడ్డి, శాప్ చైర్మన్ రవినాయుడు, జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఈ పోటీల్లో శ్రీకాళహస్తి బిడ్డ సత్తా చాటింది. శ్రీకాళహస్తికి చెందిన పత్తి నిత్య హాసిని అద్భుత ప్రతిభ కనబరిచి అండర్ 17 బాలికల విభాగం షాట్ పుట్ పోటీలో బంగారు పతకాన్ని సొంతం చేసుకుంది. చిన్న వయసులోనే పెద్ద విజయం సాధించిన నిత్య హాసిని పట్ల తల్లిదండ్రులు, కోచ్‌లు, క్రీడాభిమానులు, శ్రీకాళహస్తి ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## కార్యకర్తల్లో ఉత్సాహం నింపుతున్న ఇంటింటి ప్రచారం

### – మాజీ మండల అధ్యక్షులు గాలి మురళి నాయుడు



**తొట్టంబేడు, ఆగస్టు 29 ప్రభాతవార్త:** ...కంగా చేపట్టిన ఇంటింటికి టీడీపీ కార్యక్రమం తొట్టంబేడు మండలంలో ...హాన్ని నింపుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ...క్ష్యంతో చేపట్టిన ఈ కార్యక్రమానికి మండల వ్యాప్తంగా విజయవంతగా ... మండల అధ్యక్షులు రావిళ్ళ మునిరాజ నాయుడు, తెలుగుదేశం రాష్ట్ర ...ాయుడు, మాజీ మండల అధ్యక్షులు గాలి మురళి నాయుడు ఆధ్వర్యంలో ... ఈ కార్యక్రమం శరవేగంగా సాగుతోంది. ప్రతి ఇంటికి వెళ్లి కూటమి ...వృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ, వారి సమస్యలను అడిగి ...ర్భంగా గాలి మురళి నాయుడు మాట్లాడుతూ, చంద్రబాబు నాయుడు ...ి పథంలో వుందని, కూటమి ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చే దిశగా అడుగులు వేస్తోందన్నారు. ఇంటింటికి టీడీపీ కార్యక్రమం ద్వారా ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా నిలవాలని, ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. తొట్టంబేడు మండలంలో టీడీపీని మరింత బలోపేతం చేసి, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి జెండా ఎగురవేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. బూత్ స్థాయి నుంచి పార్టీని పటిష్టం చేసేందుకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల, గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని టిడిపి పార్టీని బలోపేతం చేస్తున్నారు.

## నాణ్యతా ప్రమాణాలను కొనసాగించండి.!

### –డివైఈఓ ఇందిరాదేవి



**చంద్రగిరి, ఆగస్టు 29 ప్రభాతవార్త:** మధ్యాహ్న భోజన పథకంలో ఇదే విధమైన నాణ్యప్రమాణాలను కొనసాగించాలన డివైఈఓ ఇందిరాదేవి అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఆమె శనివారం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులతో కలసి భోజనం చేశారు. రుచికరమైన వంటల పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన ఆమె ఇదే రీతిన నిత్యం విద్యార్థులకు రుచికరంగా, నాణ్యతతో వడ్డించాలని అన్నారు. వంటగదితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా వుంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం శారద దేవి, దోర్నకంబాల జడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం డి.జగదీష్ ప్రసాద్, కొంగరవారిపల్లి జడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం భాస్కర్ నాయుడు, పిడిలు మదనమోహన్, దోనగమ్మల మదన, తదితరులు పాల్గొన్నారు.

## ప్రణాళిక బద్ధంగా ఓటర్ల జాబితా

### –ఏఈఆర్ఓ మధుసూదన్‌రావు



**రామచంద్రాపురం, ఆగస్టు 29 ప్రభాతవార్త:** ప్రణాళిక బద్ధంగా ఓటర్ల జాబితా తయారీకి ఓటర్లు సహకరించాలని ఏఈఓఆర్ఓ మధుసూదనరావు కోరారు. శనివారం పివి పురం ఎంపిపి స్కూల్లో ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని చేపట్టారు. అనుప్పల్లిలో ఎంపిడిఓ పులిరామ్ సింగ:, నెన్నూరు సచివాలయంలో డిప్యూటీ ఎంపిడిఓ తేజోవతి, జూనియర్ అసిస్టెంట్ వంశీ ఓటర్ల పరిశీలన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటరు జాబితాలో తప్పులను సవరించేందుకు నోటీసులు అందుకున్న ఓటర్లు తమ ధృవీకరన పత్రాలతో వ్యక్తిగతంగా హాజరు కావాలన్నారు. హాజరు కాని ఓటర్లు తమ ఓట హక్కును కోల్పోతారని హెచ్చరించారు. నోటీసులో పేర్కొన్న తేదీలలో సంబంధిత అధికారుల ఎదుట హాజరుకావాలన్నారు.

## విద్యుత్‌షాక్ రైతు బలి

**శ్రీకాళహస్తి,ఆగస్టు 29 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తికి సమీపంలోని తొండమనాడులో శనివారం ఓ రైతు కుటుంబంలో విషాదం చోటు చేసుకుంది. పొలం పనులకు వెళ్ళిన గోవిందయ్య అనుమానాస్పద స్థితిలో మృతి చెందటం చుట్టుపక్కల గ్రామాల్లో చర్చనీయాంశంగా మారింది. గోవిందయ్య ఓ సామాన్య రైతుగా ఇక్కడ గుర్తించబడ్డారు. తన స్వయం కృషితో పదెకరాల మోతుబరి అయ్యారు. తన కుమారుని బాగా చదివించి ప్రయోజకుని చేసారు. పదెకరాల వ్యవసాయాన్ని తాను తన భార్య సాగించేవారని తెలిసింది. స్వయం కృషితో పాటు కష్టజీవిగా గోవిందయ్య చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రజల మన్ననలందుకున్నారు. శనివారం పంట పొలాల వద్దకు వెళ్ళిన గోవిందయ్య విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందినట్లు భావిస్తున్నారు. అయితే కరెండు స్థంభానికి దూరంగా పడి ఉండటం చేతిమీద తెల్లటి గీత ఉన్నట్లు గుర్తించారు. ఈ సంఘటనతో ఆ కుటుంబంలో విషాదం చోటు చేసుకుంది.

## వెలగని లైట్లతో ఇక్కట్లు...

### చీకట్లో నాలుగు మాడావీధులు

**శ్రీకాళహస్తి, ఆగస్టు 29 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తిలోని నాలుగుమాడావీధుల్లో వైకాపా ప్రభుత్వ హయాంలో దేవస్థానం సొమ్ములు వెచ్చించి ఏర్పాటు చేసిన వీధి లైట్లు వెలగక చిమ్మచీకట్లు కమ్ముకుంటున్నాయి. ఈ సమస్యను ఇటు దేవస్థానం అటు మున్సిపాలిటికి విన్నవించినా పట్టించుకోవటం లేదు. ఇంతకూ ఈ వీధి లైట్లను ఎవరు బాగు చేయాలి, ఎవరు వెలుగులు కల్పించాలని జనం చర్చించుకుంటున్నారు. కోట్లు వెచ్చించి ఏర్పాటు చేసిన వీధి లైట్లు వెలగకపోతే దేవస్థానం ఏమో మళ్ళీ ఏర్పాటు చేస్తామని ప్రకటిస్తున్నారు తప్ప, ఆచరణకు నోచుకోవటం లేదు. రాబోయేది వర్షాకాలం, వీధి లైట్లు లేకుంటే ఎలా అంటున్నారు. దేవస్థానం ఏ పండగ వచ్చినా నాలుగు మాడావీధుల్లో విద్యుత్ తోరణాలను ఏర్పాటు చేస్తూ కంట్రాక్టర్లకు లక్షలకు లక్షలు ముట్టచెబుతున్నారు. కానీ వీధి దీపాలు వెలగకుంటే బోర్డులో ప్రతిపాదనలు, అనుమతి, దేవాదాయశాఖకు ప్రతిపాదనలంటూ కాలయాపన చేస్తున్నారు.

ఫోటో –ఎస్‌కెహెచ్‌టి 2

రైటప్: వెలగని లైట్లు

## శనీశ్వరునికి తైలాభిషేకం

**శ్రీకాళహస్తి,ఆగస్టు 29 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన శనీశ్వరస్వామికి శనివారం విశేష సంఖ్యలో తైలాభిషేకం జరిపారు. ఇక్కడ అర్చకుడు రామకృష్ణ సారధ్యంలో స్వామి వారికి అభిషేకాలు నిర్వహించారు. శనివారం ఆలయంలో విగ్రహ రూపంలో వెలసిన శనీశ్వరునికి స్థానిక భక్తులు విశేష సంఖ్యలో వివిధ సుగంధాలతో అభిషేకించటం జరుగుతుంది. ఈ నేపథ్యంలో శనివారం స్థానిక భక్తులే కాకుండా పొరుగు రాష్ట్రాలైన తమిళనాడు, కర్నాటకల నుంచి వచ్చిన భక్తులు కూడా శనీశ్వరుని సేవల్లో పాల్గొన్నారు. గతంలో ఇక్కడ ఉచితంగా నిర్వహించే అభిషేకాలను ప్రస్తుతం సేవగా నిర్వహిస్తున్నారు. కాగా శనివారం సందర్భంగా అభయ వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు, అలంకారాలు జరిపారు.

ఫోటో –ఎస్‌కెహెచ్‌టి 3

రైటప్: శనీశ్వరునికి అభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

## ఆక్స్‌ఫర్ట్, విశ్వభారతి పాఠశాలలో తెలుగుబాషా దినోత్సవం



**శ్రీకాళహస్తి,ఆగస్టు 29 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తిలోని పలు ప్రైవేటు పాఠశాలల్లో తెలుగుభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శనివారం ముత్యాలమ్మగుడి వీధిలోని ఆక్స్ ఫర్డ్ పాఠశాలలో కరస్పాండెంట్ చెవిరెడ్డి మధుసూధనరెడ్డి సారధ్యంలో తెలుగుభాషా దినోత్స వాన్ని నిర్వహించారు. విద్యార్థులచే తెలుగు సంప్రదాయానికి అద్దం పట్టే సంప్రదాయ దుస్తులతో ఆకట్టుకున్నారు. అలాగే తెలుగుభాషలోని కమ్మదనాన్ని గురించి ఉపాధ్యాయులు విద్యార్థులచేత చెప్పించారు. నేడు మన తెలుగుభాషపై పట్టులేక ఆంగ్లంపై మక్కువ పెంచుకుంటున్నామని అయితే ఆ భాష కూడా అవసరమే నని కానీ మన తెలుగుభాషను మరువరాదన్నారు. ఈ సందర్భంగా తెలుగుపండితులు సతిపతి, పద్మజ,శాలినిలు తెలుగుభాషకు సంబంధించిన గ్రంధాలను వివరించారు. ఈ సందర్బంగా విద్యార్థులచే తెలుగుభాషలో పద్యాలు.పాటలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

**విశ్వభారతి హైస్కూల్ నందు :**



పట్టణంలోని విశ్వభారతి ఇంగ్లీషు మీడియం హైస్కూల్ నందు శనివారం తెలుగు భాషా దినోత్సవాని కరస్పాండెంట్ శోభ, ప్రధానోపాధ్యాయుడు శ్రీధర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తెలుగు భాషా ప్రాముఖ్యత గురించి విద్యార్థుల ప్రసంగాలు, నత్యాలు ఎంతగానో ఆకట్టున్నాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాతృభాషపై పట్టు సాధిస్తే, పర భాషలు అవలీలగా మాట్లాడవచ్చునని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులు మొబెల్‌లో... కాదు మైదానంలో ఆడాలి!



**శ్రీకాళహస్తి ఆగస్టు 29 ప్రభాతవార్త:** క్రీడలతో విద్యార్థుల్లో ఆరోగ్యం క్రమశిక్షణ ఆత్మవిశ్వాసం నాయకత్వ లక్షణాలు పెరుగుతాయని తిరుపతి జిల్లా విద్యాశాఖాధికారి కె.వి.ఎన్ కుమార్ అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యాశాఖా, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం జాతీయ క్రీడాదినోత్సవం క్రీడా ప్రతిభ అవార్డుల ప్రధానోత్సం నిర్వహించారు. ముఖ్యఅతిధిగా డిఈఓ కుమార్ హాజరై మాట్లాడుతూ విద్యార్థులు మొబైల్ గేమ్స్‌కు దూరంగా ఉండాలని మైదానాలో తమ ప్రతిభను చూపాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభావంతులైన క్రీడాకారులు ఉన్నారని వారిని పాఠశాల స్థాయిలోనే గుర్తించి శిక్షణ ఇచ్చి జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ వివిధ క్రీడల్లో విజయం సాధించిన విదార్థులకు మెడల్స్, షీల్డ్ ప్రసంసాపత్రాలు అంజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్జీఎఫ్ కిషోర్ ఎంఈఓ బాలయ్య తిరుపతి జిల్లా అడ్మినిస్ట్రేషన్ కార్యదర్శి భార్గవి, పీడిలు, వ్యాయమఉపాధ్యాయునిఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## చైతన్య పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం




**శ్రీకాళహస్తి, ఆగస్టు 29 ప్రభాతవార్త:** శ్రీరామ్ నగర్ కాలనీలోని శ్రీ చైతన్య పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. దేశ భాష లందు తెలుగు లెస్స అనే నినాదంతో విద్యార్థులు సాంప్ర దాయ దుస్తుల్లో పాల్గొని వేడుకను వైభవంగా నిర్వహించారు. తెలుగు పద్యాలు, పాటలు, ప్రసంగాలు, నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో చిన్నారుల ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపల్ ఎ.రూపాదేవి, ఏజీఎం సురేష్, స్టేట్ కోఆర్డినేటర్ బాలాజీ, జోనల్ కోఆర్డినేటర్లు శ్రీనివాసులు, లావణ్య, డీన్ త్రివేణి, ఇన్చార్జులు కల్పన, శ్రీహరి, వంశీ, వాసంతి, తెలుగు హెచ్.ఓ.డి సునీల్, తెలుగు ఉపాధ్యాయులు భారతి, ముని జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## పేద గిరిజన విద్యార్థులకు విద్యాసామగ్రి వితరణ




**శ్రీకాళహస్తి, ఆగస్టు 29 ప్రభాతవార్త:** చదువుకోవాలనే తపన ఉన్నా కనీస వసతులు లేక ఇబ్బంది పడుతున్న గిరిజన చిన్నారుల కుడాక్టర్ యల్లంపాటి కోటేశ్వర బాబు అండగా నిలిచారు. పట్టణంలోని లంకమిట్ట ప్రాంతంలో సొసైటీ ఫర్ హ్యూమన్ రైట్స్ అండ్ సోషల్ డెవలప్ మెంట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ట్యూషన్ సెంటర్‌లో 1వ తరగతి నుండి 7వ తరగతి వరకు 43 మంది గిరిజన విద్యార్థులు చదువుకుంటున్నారు. పేదరికంలో ఉన్న ఈ చిన్నారులు మధ్యాహ్న భోజన సమయంలో ప్లేట్లు, గ్లాసులు లేక ఇబ్బంది పడుతున్నారని తెలుసుకున్న డాక్టర్ కోటేశ్వరబాబు శనివారం స్వయంగా అందించారు. ట్యూషన్ మాస్టర్ షేక్ అజారుద్దీన్, విశాలాంధ్ర రిపోర్టర్ పురుషోత్తం, మస్తాన్, శైల, పుష్ప, ధర్మమ్మ, గాయత్రి, ఢిల్లేశ్వరి, చెంచమ్మ, శ్రీలత, పవిత్ర తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా తెలుగు భాషా దినోత్సవం



తడ ఆగస్టు 29 ప్రభాతవార్త : తెలుగు భాషా వైభవాన్ని సుసపన్నం చేసినటువంటి గిడుగు రామ్మూర్తి సేవలను స్మరిస్తూ తెలుగుభాషా దినోత్సవం మోడల్ ప్రైమరీ స్కూల్ అండగుండాల పాఠశాలలోఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రత్యేక తిధిగా కారంచేటి మల్లికార్జునశర్మ హాజరై తెలుగు భాష యొక్క గొప్పతనాన్ని తెలుగు సంస్కృతి వారసత్వం గూర్చి తెలియజేశారు, ఈ కార్యక్రమంలో ఆత్మీయ అతిథులుగా పాల్గొన్నటువంటి మండల విద్యాశాఖ అధికారులు వేములు మల్లికార్జున రావు మాట్లాడుతూ తెలుగువారి వైభవాన్ని దశదిశల చాటిన ఘనత గిడుగు రామ్మూర్తికి దక్కుతుందని దేశ విదేశాలులో సైతం తెలుగు వారు అత్యున్నత స్థాయిలో ఉండడం గర్వ కారణమని దేశభాషలందు తెలుగు లెస్స అన్న ఆ శ్రీకృష్ణదేవ రాయల స్ఫూర్తితో తెలుగు వైభవాన్ని కాపాడుకోవడం మన అందరి బాధ్యత అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కథలు కృతులు ,కీర్తనలు ,పాటలు పద్యాలు, నాటికలు, కోలాటం విద్యార్థులు పాల్గొనడం జరిగింది .మొల్లమాంబ మొల్ల రామాయణం రూపకం ప్రత్యేకంగా ఆకట్టుకుంది ,అదేవిధంగా తెలుగు విశిష్టతను చాటుతూ నాటిక విశేషంగా ఆకట్టుకున్నాయి, పాల్గొన్న విద్యార్థిని విద్యార్థులందరికీ బహుమతులు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో హెడ్మాస్టర్ ఉస్మాన్ భాష టీచర్లు సుజన్ మంజు భార్గవి తదితరులు పాల్గొన్నారు

## అసత్య ఆరోపణలు చేస్తున్న...వైసీపీ నాయకులు



పెళ్లకూరు, ఆగస్టు 29 ప్రభాతవార్త: పునబాక గ్రామానికి చెందిన అధికార తెలుగుదేశం పార్టీకి చెందిన నాయకులు దౌర్జన్యంగా భూకబ్జా చేస్తున్నారని పత్రికల్లో వచ్చిన ఆరోపణల పట్ల కూటమి ప్రభుత్వానికి చెందిన నాయకులు శనివారం పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేసి అసత్య ప్రచారాలు చేస్తున్న వైసిపి నాయకులపై విరుచుకుపడ్డారు. వైసిపి వారు చేస్తున్న భూకబ్జా ఆరోపణలపై కూటమి నాయకులు మాట్లాడుతూ పునబాక గ్రామ పంచాయతీ నందు 1996లో పశువుల ఆసుపత్రి, అంగన్వాడి కేంద్రం, పంచాయతీ భవన్ మంజూరు కాగా వాటిని నిర్మించడానికి అనువైన స్థలం కోసం ఆబాక కృష్ణారెడ్డి, ఆబాక రామిరెడ్డిలకు చెందిన స్థలమును గ్రామస్తులంతా కలిసి ఇవ్వవలసిందిగా వారిని ఒప్పించి దానికి ప్రత్యామ్నాయంగా వారికి వేరే దగ్గర స్థలం చూపించడంతో ఆ స్థలంలో ప్రభుత్వ భవనాలు నిర్మించడం జరిగిందని, వారికి ప్రత్యామ్నాయంగా ఇచ్చిన భూములను వారు తాళ్ల కేశవులు, తాళ్ల. యుగంధర్‌లకు అమ్మి వేయడం జరిగిందని ఆ స్థలంలో ఇప్పుడు గృహ నిర్మాణ అవసరాల కోసం మట్టిని తోలుతుండడంతో వైసీపీ నాయకులు అడ్డుపడుతూ భూ కబ్జాలు అంటూ అసత్య ఆరోపణలు చేస్తూ కూటమి నాయకులపై బురద చల్లాలని ప్రయత్నించడం విడ్డూరంగా ఉందన్నారు. అసలైన భూకబ్జాదారులు వైసీపీ నాయకులేనని వైసీపీ ప్రభుత్వ అధికారంలో ఉండగా గ్రామంలో ఉన్న ప్రభుత్వ భూములు ఆక్రమించుకున్న ఘనత వైసిపి నాయకులుదే అన్నారు.

## వేగవంతంగా ఓటరు జాబితా పరిశీలన ప్రక్రియ



తడఆగస్టు 29 ప్రభాతవార్త : మండల పరిధిలో వివిధ పోలింగ్ స్టేషన్ నందు ఓటర్ పరిశీలన ప్రక్రియను ఎమ్మార్వో రవికుమార్ వేగవంతం చేశారు. గతంలో నిర్వహించిన ఓటర్ వెరిఫికేషన్ ప్రక్రియలో తలెత్తిన సమస్యలపై ఓటర్లకు నోటీసులు జారీ చేయబడింది వారికి సంబంధించిన ప్రభుత్వం ద్వారా జారీ చేయబడిన పత్రాలు సమర్పించి ఓటర్ వెరిఫికేషన్ లో ఏర్పడిన సమస్యలను పరిష్కరించేందుకు ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధిలో వెరిఫికేషన్ ప్రక్రియ ప్రారంభించారు. అందులో భాగంగా శనివారం తడ మండలం వెండ్లూరుపాడు పోలింగ్ స్టేషన్ నందు ఆర్డబ్ల్యూఎస్ ఏఈ ప్రకాష్, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీ ప్రసన్న ఓటర్ వెరిఫికేషన్ ప్రక్రియను నిర్వహించారు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా నిర్వహించారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి...ఇద్దరికి గాయాలు



పెళ్లకూరు, ఆగస్టు 29 ప్రభాతవార్త: మండలంలోని తల్వాయిపాడు గ్రామ సమీపంలో 71వ నెంబర్ జాతీయ రహదారిపై శనివారం ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో ఒక యువకుడు అక్కడే అక్కడికే మృతి చెందగా ఇద్దరు యువకులు తీవ్రంగా గాయాల పాలయ్యారు. స్థానికుల కథనం ప్రకారం ప్రతిరోజు ఉదయం మార్నింగ్ వాక్ చేసే ముగ్గురు యువకులు రోజు లాగే శనివారం ఉదయం మార్నింగ్ చేసి రోడ్డు ప్రక్కనే విశ్రాంతికై కూర్చుని ఉండగా అటుగా వేగంగా వెళుతున్న అశోక్ లేలాండ్ దోస్త్ వాహనం ఢీకొనడంతో ఆదిత్య బాంబే (17) అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా మన్వేష్ (17), బ్రహ్మయ్య(17) అనే ఇద్దరు యువకులు తీవ్రంగా గాయాలు పాలయ్యారు. ప్రమాదానికి గురైన ముగ్గురు యువకులు నాయుడుపేటలో ఉన్న వేమా కాలేజీలు ఇంటర్మీడియట్ చదువుతున్నారు. ప్రమాదంలో మరణించిన ఆదిత్య బాంబే ది బీహార్ రాష్ట్రం కాగా మిగిలిన ఇద్దరు విద్యార్థులు నాయుడుపేట వారు. ఈ ప్రమాద ఘటన గురించి తెలిసిన వెంటనే పెళ్లకూరు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## మాదకద్రవ్యాలు వద్దు... క్రీడలు ముద్దు!



రేణిగుంట, ఆగస్టు 29 ప్రభాతవార్త: మాదక ద్రవ్యాల మత్తులో జీవితాలను చిత్తు చేసుకోకుండా యువత విద్య, ఉపాధి, క్రీడలు, నైపుణ్యాభివృద్ధి, తదితర సమాజానికి ఉపయోగపడే వ్యక్తిగత వికాసానికి తోడ్పడే అంశాల వైపు అడుగులు వేసి యువకులు ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని రేణిగుంట అర్బన్ పోలీసులు సూచించారు. మత్తు పదార్థాల వినియోగంతో ఆరోగ్యం, కుటుంబ సంబంధాలు, విద్య, ఉపాధి, ఆర్థిక పరిస్థితి, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడుతుందని హెచ్చరించారు. తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా గంజాయి, ఇతర మాదకద్రవ్యాల నిర్మూలనకు పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా రేణిగుంట తారకరామనగర్‌లో యువతకు గంజాయి, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు పర్యవేక్షణలో, సీఐ జయచంద్ర ఆధ్వర్యంలో ఎస్సై శ్రీనివాసులు పోలీసు శాఖ ఈగల్ టీం ద్వారా ఏర్పాటు చేసిన ప్రత్యేక గులాబీ బస్సు ద్వారా గంజాయి వినియోగంపై ప్రత్యేక కిట్లతో పరీక్షలు నిర్వహించారు. మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టడం, యువతను అప్రమత్తం చేయడం, మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను వివరించడం కార్యక్రమం ప్రధాన ఉద్దేశంగా తెలిపారు. చెడు స్నేహాలు, మత్తు పదార్థాల ప్రలోభాలకు యువత దూరంగా ఉండాలని పోలీసులు సూచించారు. గంజాయి విక్రయాలు, రవాణా, వినియో గానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియ జేయాలని, సమాచారం అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.అత్యవసర సహాయం కోసం 112కు, గంజాయి, మాదకద్రవ్యాల అక్రమ విక్రయాలు, రవాణా తదితర సమాచారాన్ని ఈగల్ ఉచిత నంబరు 1972కు తెలియజేయాలని కోరారు.ఈ సందర్భంగా డీఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ యువతే దేశ భవిష్యత్తని, మాదకద్రవ్యాలకు బానిసై ఆరోగ్యం, కుటుంబం, భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, యువత తమ శక్తిని సద్వినియోగం చేసుకుని ఉజ్వల భవిష్యత్తుకు నాంది పలకాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, స్థానికులు, యువత పాల్గొన్నారు.

# సూళ్ళూరుపేట డివిజన్

## లారీ ఢీకొని వ్యక్తి మృతి

దొరవారిసత్రం, ఆగస్టు 29 ప్రభాతవార్త: మండలంలోని తిరుపతి జిల్లా శనివారం ఉదయం 6 గంటల సమయంలో మాధవరం, గ్రామానికి చెందిన ప్రకాశం జిల్లా సంబంధించిన రావులపల్లి ఏడుకొండలు కుప్పారెడ్డిపాలెం గ్రామ సమీపంలో లారీ ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి ప్రమాదాల కారణమైన లారీని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాయుడుపేట లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని ఎస్ఐ జీవీ చౌదరి తెలిపారు.

## మేధో సంపత్తి హక్కులపై జాతీయ సదస్సు

సూళ్లూరుపేట, ఆగస్టు 29 ప్రభాతవార్త: సూళ్లూరుపేటలోని శ్రీ గోకుల కృష్ణ ఫార్మసీ కళాశాలలో నూతన ఆవిష్కరణల నుంచి రక్షణ వరకు పేటెంట్లు, మేధో సంపత్తి హక్కుల రక్షణ కల్పించడం అనే అంశంపై శనివారం జాతీయ సెమినార్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా బాలాజీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మసూటికల్ సైన్సెస్ వరంగల్‌కు చెందిన ప్రొఫెసర్ మనీష్ కుమార్ తిమ్మరాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించిన పాటువాటికి తగిన మేధోసంపత్తి హక్కుల రక్షణ కల్పించడం ఎంతో కీలకమని ఆయన చెప్పారు. విద్యార్థులు అధ్యాపకులకు పేటెంట్ల ప్రాధాన్యత మేధోసంపత్తి హక్కులు అనే అంశాలపై అవగాహన కల్పించారు. పరిశోధకులు తమ నూతన ఆలోచనలను కేవలం పరిశోధన ప్రచురణాలకే పరిమితం చేయకుండా వాటికి తగినంతపేదో సంపత్తి హక్కుల రక్షణ కల్పించి సమాజానికి పరిశ్రమలకు ఉపయోగపడే విధంగా మలచుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ బాలగాని పవన్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకతనుపరిశోధనా దృక్పథం ఆవిష్కరణల పట్ల ఆసక్తిని కల్పించేందుకు ఇటువంటి జాతీయ స్థాయి సెమినార్లు ఉపయోగ పడతాయని తెలిపారు. అనంతరం ప్రొఫెసర్ మనీష్ కుమార్ తిమ్మరాజును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమాన్ని ఫార్మాస్యూటిక్స్ విభాగం, సంస్థాగత ఆవిష్కరణల మండలి, సంయుక్తంగా, అంతర్గత నాణ్యతా హామీ విభాగం ఆధ్వర్యంలో అసోసియేషన్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ టీచర్స్ ఆఫ్ ఇండియా - ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ వారి సహకారంతో నిర్వహించారు.

## ఆరోగ్య సమాజం ఆవిష్కరించేలా రోగులకు పక్కా సేవలు

**- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగ శశిభూషణ్‌రెడ్డి**



చిత్తూరు, ఆగస్టు 29 ప్రభాతవార్త: వైద్యం కోసం ఆసుపత్రులకు వచ్చిన రోగులకు పక్కాగా వైద్య సేవలు అందించి ఆరోగ్య సమాజ ఆవిష్కరణకు వైద్యాధికారులు, వైద్య సిబ్బంది నడుం బిగించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగ శశిభూషణ్‌రెడ్డి అన్నారు. డిఎంహెచ్‌ఓ డాక్టర్ నాగ శశిభూషణ్‌రెడ్డి శనివారం చిత్తూరు నగర పరిధిలోని సత్యనారాయణపురం, మురకంబట్టు, ఈచవటపల్లి ప్రాంతాల్లోని అర్బన్ ఆరోగ్య కేంద్రాలను అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డిఎంహెచ్‌ఓ డాక్టర్ నాగ శశిభూషణ్‌రెడ్డి వైద్యులతో మాట్లాడుతూ వైద్యం కోసం పిహెచ్‌సికి వచ్చిన రోగులకు మెరుగైన వైద్యం అందించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే అర్బన్ పిహెచ్‌సిల ఆవరణలో పరిసరాలను పరిశుభ్రంగా వుంచుకోవాలని, అర్బన్ పిహెచ్‌సిలకు సంబంధించిన అన్ని రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసి వుంచాలని వైద్యాధికారులను ఆదేశించారు. అలాగే అర్బన్ పిహెచ్‌సిల పరిధిలో సంజీవని కార్యక్రమం, హెచ్‌పివీ వాక్సినేషన్ తదితర ఆరోగ్య కార్యక్రమాలను పురోగతిని వైద్యాధికారులు నిత్యం పర్యవేక్షిస్తూ సంబంధిత వివరాలను ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు వంద శాతం అప్‌లోడ్ చేయాలని డిఎంహెచ్‌ఓ ఆదేశించారు. పిహెచ్‌సి వైద్యాధికారులు, సిబ్బంది రోగులకు అందుతున్న వైద్య సేవల్లో ఎలాంటి లోటుపాట్లు రానీయకుండా సమన్వయంతో పని చేయాలని సూచించారు. అకస్మిక తనిఖీల ద్వారా ఆసుపత్రుల్లో సేవల నాణ్యత, పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, ఆరోగ్య కార్యక్రమాల అమలును నిరంతరం పర్యవేక్షించడానికి అవకాశం వుంటుందన్నారు. ఈ తనిఖీల్లో డిఎంహెచ్‌ఓ డాక్టర్ నాగ శశిభూషణ్‌రెడ్డితో పాటు సంబంధిత అర్బన్ పిహెచ్‌సి డాక్టర్లు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కుప్పం వాసి ఆచూకీకై నేపాల్ ఎంబసీకి లేఖ

**- సుప్రీంకోర్టు న్యాయవాదుల ద్వారా హోంమంత్రికి సైతం !!**

కుప్పం, ఆగస్టు 29 ప్రభాతవార్త: కైలాస మానస సరోవర యాత్రకు వెళ్లి నేపాల్‌లో అకాల వరదల్లో అదృశ్యమైన కుప్పం వాసి, హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న విఎస్ బాలసుబ్రమణ్యం ఆచూకీ కోసం అతని కుటుంబీకులు సుప్రీ ంకోర్టు న్యాయవాదులు అర్తీషా, అనిమేష్ శుక్లాల ద్వారా న్యూఢిల్లీలోని నేపాల్ ఎంబసీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు లేఖలు పంపారు. శనివారం ఈమేరకు సుప్రీంకోర్టు న్యాయవాదులు లేఖలను పంపారు. నేపాల్‌లో బాలసుబ్రమణ్యం సురక్షితంగా ఉన్నారా, అతని చివరి కాల్‌రికార్డు, ప్రదేశం సమాచారం తెలపాలని పేర్కొన్నారు. అలాగే అతన్ని ఎక్కడైనా సురక్షిత ప్రాంతానికి తరలించారా, ఒకవేళ బాలసుబ్రమణ్యంకు ఏదేని సమస్యలు ఉంటే అతనికి వైద్య సేవలు అందించడంతో పాటు కుటుంబీకులకు సమాచారం అందించి క్షేమంగా తిరిగి రప్పించాలని లేఖలో సుప్రీ ంకోర్టు న్యాయవాదులు లేఖలో ప్రస్తావించారు. ఈ అంశాన్ని మానవత్వంతో చేపట్టడంతో పాటు త్వరగా సమాచారం అందించాలని లేఖలో పేర్కొన్నారు.

## సమాజం విసిరే సవాళ్ళను...అధిగమించి విజేతలుగా నిలవాలి!

**-అట్టహాసంగా మోహన్‌బాబు విశ్వ విద్యాలయం 3వ స్నాతకోత్సవం -ఎంబియు అధినేతలు మంచు విష్ణు, మంచు మోహన్‌బాబు**



చంద్రగిరి, ఆగస్టు 29 ప్రభాతవార్త: కళాశాల జీవితాన్ని పూర్తి చేసుకున్న మీరంతా ఇకపై సమాజం విసిరే పెను సవాళ్ళను సైతం ఎదుర్కొని వాటిని అధిగమించి విజేతలు నిలవాలని మోహన్‌బాబు యూనివర్శిటీ ప్రో-ఛాన్సలర్ మంచు విష్ణు అన్నారు. మోహన్‌బాబు విశ్వ విద్యాలయం 3వ స్నాతకోత్సవ వేడుకలు శనివారం అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతటి స్థానాన్ని అందిపుచ్చుకున్నప్పటికీ మాతా, పితా, గురు, దైవం అనే ఈ నాలుగు సూత్రాలను విస్మరించవద్దని హితవు పలికారు. నేటి ఈ స్థాయి మీకు లభించడంలో మీ తల్లిదండ్రులు చేసిన అనేక త్యాగాలను స్మరణలో వుంచుకోవాలని అన్నారు. అదేవిధంగా యూనివర్శిటీ ఛాన్సలర్ డాక్టర్ మంచు మోహన్‌బాబు మాట్లాడుతూ ఇంజినీరింగ్ కళాశాల స్థాయి నుండి విశ్వ విద్యాలయం స్థాయికి రూపాంతరం చెందిన క్రమంలో దాదాపు 25 వేల మందికి పైగా విద్యార్థులు తమ విద్యాభ్యాసాన్ని పూర్తి చేసుకుని దేశంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా వివిధ హోదాలలో స్థిరపడటం ఎంతో గర్వకారణమన్నారు. చదువు మాత్రమే కాకుండా క్రమశిక్షణ, గౌరవం, నిజాయితీ అలవరుచుకున్నప్పుడే ఉజ్వల భవష్యత్తు లభించగలదన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన బిసిసిఐ వైస్ ప్రెసిడెంట్, ఎంపి రాజీవ్ శుక్లా మాట్లాడుతూ మోహన్‌బాబు విశ్వ విద్యాలయంలో 51 శాతం మంది విద్యార్థినులు వుండటం హర్షనీయమన్నారు. మాజీ రాష్ట్రపతి దివంగత ఏ.పి.జె.అబ్దుల్ కలామ్ చెప్పిన మాటలను గుర్తు చేస్తూ ఒక మహిళ విద్యావంతురాలైతే ఆమెకు విద్య నిజమైన శక్తి కాగలదన్నారు. కేవలం తరగతి గదిలో సాధించిన మార్కులు మాత్రమే కాకుండా అదనపు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని అన్నారు. స్నాతకోత్సవంలో 3600 మంది విద్యార్థులకు డిగ్రీ పట్టాలను అందజేయడంతో పాటు రాజీవ్ శుక్లా, పద్మశ్రీ పరేష్ మైథిలకు గౌరవ డాక్టరేట్లు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎంజిఆర్ ఎడ్యుకేషనల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఛాన్సలర్ డాక్టర్ ఏ.సి.షణ్ముగం, బి.ఎ.జి.ఫిల్మ్ అండ్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అనురాధ ప్రసాద్, విద్యానికేతన్ డైరెక్టర్ వినయ్ మహేశ్వరి, ఎంబియు వైస్ ఛాన్సలర్ పి.వెంకటరమణ, రిజిస్ట్రార్ సారథి, అధ్యాపకులు, అతిథులు పాల్గొన్నారు.

## తిరుచ్చి వాహనంపై దేవేరులతో శ్రీనివాసుడు



చంద్రగిరి, ఆగస్టు 29 ప్రభాతవార్త: శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీకల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శనివారం శ్రీనివాసుడు తన దేవేరులతో తిరుచ్చి వాహనంపై తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ యం.గోపినాద్, సూపరింటెండెంట్ హరికృష్ణ, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ద్వారక మునికుమార్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ అనుంబట్టు ధనశేఖర్, ఓఎస్ బైరెడ్డి హరిప్రసాద్, అర్చకులు కళ్యాణ్ సుందర్, విష్ణుమూర్తి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## శివయ్య సేవలో కాణిపాకం ఇఓ దంపతులు



శ్రీకాళహస్తి, ఆగస్టు 29 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరుని సేవలో శనివారం కాణిపాకం ఆలయ కార్యనిర్వహణాధికారి పెంచల్ కిషోర్ దంపతులు పూజలు జరిపించుకున్నారు. కాణిపాకం ఆలయ ఇఓ దంపతులు రాగా దక్షిణ గోపురం వద్ద ఆలయ మర్యాదలతో ప్రోటోకాల్ ఎఇఓ లోకేష్‌బాబు, ఎపిఆర్‌ఓ రవిలు వేదపండితులతో స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్ల ఆంతరాలయ దర్శనంతో పాటు శనీశ్వరస్వామికి నిర్వహించే అభిషేకాల్లో పాల్గొన్నారు. తరువాత వారికి మృత్యుంజయ స్వామి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకా శీర్వచనాలు అందించారు. ఇఓ బికె వెంకటేశులు వారికి తీర్థ ప్రసాదాలు,స్వామి అమ్మవార్ల చిత్రపటాలను అందించారు. ఏర్పాట్లును ఆలయ ఎఇఓ విద్యాసాగర్‌రెడ్డి, టెంపుల్ఇన్స్పెక్టర్ హరియాదవ్, పర్యవేక్షకులు నాగభూషణం యాదవ్‌లు పర్యవేక్షించారు.

## కోటి స్వరాల స్వర సంగమం



తిరుమల,ఆగస్టు 29ప్రభాతవార్తప్రతినిధి: తిరుమల నాదనీరాజనంలో శనివారం సాయంత్రం కోటి స్వరాల స్వర సంగమం కార్యక్రమం జరిగింది. గణపతి పూజతో ప్రారంభించి గోవింద నామస్మరణతో శ్రీవారి, అమ్మవారి కీర్తనలను ఆలపించారు. సంగీత దర్శకుడు కోటి, సినీ గాయకులు, టిటిడి అదనపు ఈఓ వెంకయ్య చౌదరి, ఎస్వీబిసి చైర్మన్ బి.శ్రీధర్‌వర్మ, అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

## పుత్తూరులో గ్రానైట్ క్వారీల దౌర్జన్యం

**-అక్రమ బ్లాస్టింగ్‌తో ప్రజలు బెంబేలు**





పుత్తూరు, ఆగస్టు 29 ప్రభాతవార్త : పట్టణంలోని చెర్లోపల్లిలో జరుగుతున్న గ్రానైట్ క్వారీల అక్రమ బ్లాస్టింగ్‌లతో గ్రామస్తులు తీవ్ర భయాందోళనలకు గురవుతు న్నారు. ఎపుడు, ఏ సమయంలో క్వారీ రాళ్ల తమపై పడతాయో తెలియక బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. శనివారం స్థానికంగా వున్న ఒక గ్రానైట్ క్వారీలో జరిగిన బ్లాస్టింగ్ నుంచి ఒక రాయి వచ్చి ట్రాక్టర్‌తో పొలం దున్నుకుంటున్న ఈశ్వర్‌యాదవ్ అనే వ్యక్తికి సమీపంలో పడింది. పొరపాటున రాయి ఆ వ్యక్తిపై పడితే కచ్చితంగా ప్రాణాలు పోయే ప్రమాదం వున్న నేపథ్యంలో తృటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్న రైతు పొలం నుంచి పరుగులు తీశాడు. తర్వాత చిన్న చిన్న రాళ్లు పొలంలో పడుతూనే వున్నాయని తెలిపారు. ఎప్పుడు పడితే అప్పుడు అది కూడా అనుమతి లేకుండా బ్లాస్టింగ్ చేస్తుండడం వల్ల చెర్లోపల్లి గ్రామస్తులు భయం, భయంగా జీవనం సాగిస్తున్నారు. అక్రమ బ్లాస్టింగ్ చేస్తున్న క్వారీలపై రెవెన్యూ శాఖాధికారులు చర్యలు తీసుకోవాలని, అసలు బ్లాస్టింగ్‌కు లైసెన్స్ లేని క్వారీలను నిలిపివేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

## నుదుటిన నామం...సాంప్రదాయ దుస్తుల్లో

**బిజెపి చీఫ్ మాధవ్ భక్తిభావం**



తిరుపతి,ఆగస్టు 29ప్రభాతవార్త: పుణ్యక్షేత్రమైన తిరుపతి నగరంలో శనివారం తెల్లవారుజామున జరిగిన నగరసంకీర్తనలో బిజెపి రాష్ట్ర చీఫ్ పివిఎన్ మాధవ్ ఆధ్యాత్మికభావనతో నడిచారు. భజన మండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నగర సంకీర్తనలో శనివారం ఆయన పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. సంప్రదాయ వస్త్రధారణతో, నుదుటతిరునామాలతో గోవిందరాజస్వామి ఆలయం తూర్పు మాడవీధిలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద నుండి నగర సంకీర్తనలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్, ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు,జల్లి మధుసూదన్ సంకీర్తన మండలి సభ్యులు గుండాల గోపీనాథ్‌రెడ్డి, మునినాథ రెడ్డి, వాసుదేవ రెడ్డి, మునిరత్న ఆచారి, పొనుగంట భాస్కర్, చిత్ర హనుమంతరావు, లోక ప్రభాకర్ నాయుడ, ఆదం అనిల్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, శైలజా రెడ్డి, కళ్యాణి, సుశీల, శ్రావణి, కల్పన, పద్మావతి, జయమ్మ పాల్గొన్నారు.


కెనరా బ్యాంక్ Canara Bank

ఎ ఆర్ ఎమ్ బ్రాంచ్ (13591), విశాఖపట్నం
మెలోడీ సినిమా థియేటర్ ఎదురుగా, సూర్యాభాగ్, విశాఖపట్నం-530020.
ఫోన్: 8332956773, 7095199455, ఇ-మెయిల్: cb13591@canarabank.com

**హైపోథికేషన్ అగ్రిమెంట్ ప్రకారం బ్యాంకుకి సెక్యూరిటీగా హైపోథికేట్ చేసిన మెషినరీస్ అమ్మకానికి ఇ-వేలం అమ్మకం ప్రకటన**

సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన కెనరా బ్యాంక్ వారికి దిగువ తెలిపిన ఋణగ్రహీతలు/హామీదారులు చెల్లించవలసిన బకాయి మొత్తంను రాబట్టుకొనుటకు కెనరా బ్యాంక్ అధీకృత అధికారిచే స్వాధీనం చేసుకున్న, బ్యాంకుకి హైపోథికేటెడ్/ఛార్జి చేసిన దిగువ వివరించిన మెషినరీను హైపోథికేషన్ అగ్రిమెంట్ ప్రకారం తేది 08.10.2026 న "ఎక్కడ ఎలా ఉన్నది" "అక్కడ అలా" మరియు "అక్కడ ఏమున్నదో అది" అనే ప్రాతిపదికన విక్రయించబడునని యావన్మంది ప్రజానీకానికి మరియు ముఖ్యంగా దిగువ తెలిపిన ఋణగ్రహీతలు మరియు హామీదారులకు తెలియజేయడమైనది.

**ఇ-వేలం తేది & సమయం: 08.10.2026, మ॥ 1.00 గం.ల నుండి మ॥ 2.00 గం.ల వరకు**

(అమ్మకం ముగిసేవరకు ప్రతి 5 నిమిషముల వ్యవధిలో అపరిమిత పొడిగింపుతో) రిజర్వు ధరలో 10% ధరావత్తు సొమ్మును M/s. పిఎస్‌బి అలియన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (baanknet) పోర్టల్ యొక్క ఇ-వ్యాలెట్‌లో నేరుగా గాని లేదా ఆ పోర్టల్‌లో చలానా జెనరేట్ చేసుకొని చలాన్‌లోని ఖాతా వివరములుకు ధరావత్తును RTGS/NEFT ద్వారా తేది: 08.10.2026, మ॥ 01:50 గం.ల లోపుగా పొందుపరిచి జమచేయాలి.

ఋణగ్రహీత : M/s. గౌతమి ఆగ్రో ఇండస్ట్రీస్, ప్రాతినిధ్యం వహిస్తున్నవారు మేనేజింగ్ పార్ట్‌నర్ శ్రీమతి మల్లిన శ్రీదేవి & హామీదారులు: 1) శ్రీమతి మల్లిన శ్రీ దేవి, భర్త: వెంకట శ్రీహరి రావు, 2) శ్రీమతి మల్లిన లక్ష్మి తులసి, భర్త: ఎమ్. సత్యనారాయణ, 3) శ్రీమతి పెమ్మసాని అన్నపూర్ణ, భర్త: మధు ప్రతాప్, 4) శ్రీమతి పి. ప్రశాంతి, భర్త: వెంకట రమణ, 5) శ్రీ మల్లిన సత్యనారాయణ రావు, తండ్రి: వెంకట రావు. బకాయి మొత్తం: తేది.31.07.2026 నాటికి రూ. 10.64 కోట్లు + తదుపరి వడ్డీ, వ్యయాలు & ఇతర ఛార్జీలు.

P&M/Stock వివరములు : పశ్చిమ గోదావరి జిల్లా-534350, కొవ్వూరు, ఇండస్ట్రియల్ ఏరియా, # 12-1-10 వద్ద మ్యానుఫాక్చరింగ్ ఆఫ్ క్యాటిల్ ఫీడ్ మెషినరీ M/s. గౌతమి ఆగ్రో ఇండస్ట్రీస్ పేరున కలదు.

ఐటమ్ పేరు : HARD CASE make animal feed plant poultry / Animal feed milling Plant, capacity 60 to 65 T/shift (08 hrs per shift)

**1)** Auto Batch weighing section - 01 Nos, **2)** Intake dumping hopper with magnetic grill - 02 Nos, **3)** Godown Chain Conveyor - 01 Nos, **4)** Bucket elevator - 01, **5)** Cascading magnetic sapperator - 01 Nos, **6)** 3 way flap gate -01 Nos, **7)** Distribution conveyor - 01 Nos, **8)** Slide gate Pnuematically operated - 01, **9)** 2 way flap gate pneumatically operated - 02 Nos, **10)** Batching Binns -06, **11)** Discharges/screw feeders - 06 Nos, **12)** Way hopper - 01 No, **13)** Surge Hopper - 01, **14)** Transfer conveyor, **15)** Process control electronic -01 Nos, **16)** Connecting chutes & Hoppers, **17)** Main feed plant processing section, **18)** Bucket elevator -01, **19)** Bin above grinder with paddle feeder, **20)** Feed grinder -01, **21)** Transfer conveyor 02, **22)** Bucket elevator 2, **23)** Batch Binn above the mixer -01, **24)** Feed mixer -01, **25)** Variable freeqency drive-01, **26)** Surge bin below the mixer -01, **27)** Transfer conveyor 3, **28)** Bucket elevator 3, **29)** 2way flap gate pneumatic operated, **30)** Bin above molasis mixer, **31)** Slide gate Pnuematic operated, **32)** Mollasis dosing system, **33)** Molasis mixer -01, **34)** Baging bin -01, **35)** 2way flap gate pneumatically operated -01, **36)** Automatic weiging & bagging machine -01, **37)** Bage stiching machine, **38)** Mixing cycle monitoring, **39)** MCC, **40)** Cable & Motors, **41)** Molasis tank with loading pump with motor. **Total : Rs. 21,55,000/-**

**Remark if any : As per valuation dated 18/06/2026 issued by B. Subramanya Sastry.**

**రిజర్వు ధర : రూ. 21,55,000/-  ధరావత్తు సొమ్ము : రూ. 2,15,500/-**

**ఆస్తి తనిఖీ తేది & సమయం : 30.09.2026, ఉ॥ 10.00 గం॥ల నుండి సా॥ 4.00 గం॥ల వరకు**

అమ్మకానికి సంబంధించిన సవివరమైన నియమ నిబంధనలకు కెనరా బ్యాంక్ వెబ్‌సైట్ www.canarabank.com లో ఏర్పాటు చేసిన "ఇ-వేలం" లింక్‌ను రిఫర్ చేయండి లేదా కెనరా బ్యాంక్ ఎ.ఆర్.ఎం బ్రాంచ్, విశాఖపట్నం అధీకృత అధికారి గారిని ఆఫీసు పనివేళలలో సంప్రదించగలరు. ఫోన్ : 83329 56773, 70951 99455

రిజర్వు ధరలో 10% సొమ్మును ధరావత్తుగా ఆర్.టి.జి.ఎస్/నెఫ్ట్/ఫండ్ ట్రాన్స్‌ఫర్ ద్వారా https://baanknet.com లోని E-వాలెట్‌కు బిడ్డర్ లాగిన్ అయి తేది.08.10.2026, మ॥ 1:50 గం.ల లోపుగా చెల్లించవలెను.

* బ్యాంకుకు తెలిసిన/తెలియని బకాయిలు/టాక్స్‌లు ఏవైనా ఉన్నచో అవి వేలం కొనుగోలుదారే భరించాలి మరియు తుది బిడ్ మొత్తంతోపాటు అవి కూడా చెల్లించవలసి ఉంటుంది. బిడ్డర్లు తమ ఆఫర్‌లను, ఆస్తి రిజర్వు ధర 25 లక్షల వరకు ఉన్నవాటికి రూ. 10,000/- గుణింపులో హెచ్చించవలెను, రిజర్వు ధర 25 లక్షల నుండి 50 లక్షల వరకు ఉన్నవాటికి రూ. 25,000/- గుణింపులో హెచ్చించవలెను, రిజర్వు ధర 50 లక్షల నుండి 100 లక్షల వరకు ఉన్నట్లయితే రూ. 50,000/- గుణింపులో హెచ్చించవలెను, రిజర్వు ధర 100 లక్షల నుండి 500 లక్షల వరకు ఉన్నట్లయితే రూ. 1,00,000/- గుణింపులో హెచ్చించవలెను మరియు రిజర్వు ధర 500 లక్షల ఎక్కువ ఉన్నట్లయితే రూ. 5,00,000/- గుణింపులో హెచ్చించవలెను. 'ఆన్‌లైన్' వేలం ముగిసేలోపు అత్యధిక బిడ్ (రిజర్వు ధర కన్నా ఎక్కువ) సమర్పించిన బిడ్డర్ విజయవంతమైన బిడ్డర్‌గా ప్రకటించబడతారు.

ఇ-వేలం విధానం, నియమ నిబంధనల కొరకు సర్వీసు ప్రొవైడర్‌ను సంప్రదించండి: మెస్సర్స్ పిఎస్‌బి అలయన్స్(baanknet), వెబ్‌పోర్టల్ https://baanknet.com, హెల్ప్‌డెస్క్: 7046612345/6354910172/8291220220/9892219848 / 8160205051, ఇ-మెయిల్: support.baanknet@psballiance.com

తేది: 24.08.2026, ప్రదేశం: విశాఖపట్నం  సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

## పౌర హక్కుల దినోత్సవాన్ని సద్వినియోగం చేసుకోవాలి

– హక్కులు, బాధ్యతలపై ఎస్సీ, ఎస్టీ ప్రజలు అవగాహన పెంచుకోవాలి
– డీవీఎంసీ సభ్యుడు గుత్తి త్యాగరాజు విజ్ఞప్తి

**వరదయ్యపాలెం, ఆగస్టు 29 ప్రభాతవార్త:**



ఎస్సీ, ఎస్టీ ప్రజలు తమకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టపరమైన రక్షణలు, బాధ్యతలపై అవగాహన పెంచుకోవాలని డివిజన్ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ (డీవీఎంసీ) సభ్యుడు గుత్తి త్యాగరాజు విజ్ఞప్తి చేశారు. పౌర హక్కుల దినోత్సవం సందర్భ ంగా నిర్వహించే అవగాహనా కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఆగస్టు నెలలో నిర్వహించే పౌర హక్కుల దినోత్సవం (సివిల్ రైట్స్ డే) కార్యక్రమాల్లో భాగంగా తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ ఆదేశాల మేరకు ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో ప్రత్యేక అవగాహనా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఆగస్టు 31న సత్యవేడు మండలం కదిరివేడు ఎస్సీ కాలనీలో మధ్యాహ్నం 3 గంటలకు, బుచ్చినాయుడు కండ్రిగ మండలం అరిగిల కండ్రిగ ఎస్టీ కాలనీలో మధ్యాహ్నం 3 గంటలకు, వరదయ్యపాలెం మండలం మరదవాడ ఎస్సీ కాలనీలో సాయంత్రం 4 గంటలకు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సంబంధిత తహసీల్దార్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో పౌర హక్కులు, సమానత్వం, వివక్షకు వ్యతిరేకంగా ఉన్న చట్టాలు, ఎస్సీ, ఎస్టీలకు కల్పించిన రక్షణలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఫిర్యాదు చేసే విధానాలపై ప్రజలకు అవగాహన కల్పించనున్నారు. హక్కులపై అవగాహన ఉంటేనే వాటిని సమర్థవంతంగా వినియోగించుకోగలమని, అదే సమయంలో హక్కులతో పాటు రాజ్యాంగబద్ధమైన బాధ్యతలను కూడా ప్రతి పౌరుడు పాటించాలని గుత్తి త్యాగరాజు పేర్కొన్నారు. మండల అధికారులు నిర్వహించే పౌర హక్కుల దినోత్సవ కార్యక్రమాలకు ఎస్సీ, ఎస్టీ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై సందేహాలను నివృత్తి చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ మేరకు సత్యవేడు తహసీల్దార్ శివప్రసాద్, వరదయ్యపాలెం తహసీల్దార్ శివరామసుబ్బయ్య, బుచ్చినాయుడుకండ్రిగ తహసీల్దార్ లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంకు అన్ని శాఖల మండల స్థాయి అధికారులు హాజరుకావలసి వుంది.

## అపోలో నాలెడ్జ్ సిటీలో ఘనంగా ఓనం వేడుకలు



**చిత్తూరుహెల్త్, ఆగస్టు 29 ప్రభాతవార్త:** అపోలో నాలెడ్జ్ సిటీలో శనివారం సమృద్ధి, సమానత్వం, సాంస్కృతిక ఐక్యతకు ప్రతీకగా నిలిచే ఓనం పండుగను అత్యంత వైభవంగా నిర్వహించారు. విద్యార్థులు, అధ్యాపకులు కలిసి కళాత్మక పూకళం(పూలరంగోలి)లను రూపొందించి క్యాంపస్‌ను పండుగ వాతావరణంతో కళకళలాడేలా తీర్చిదిద్దారు. ఈ వేడుకల్లో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, వినోదాత్మక ఆటలు అందరినీ ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా మ్యూజికల్ చైర్స్, లెమన్ అండ్ స్పూన్ రేస్, టీమ్ యాక్టివిటీస్ వంటి పోటీలు ఉత్సాహంగా సాగాయి. విద్యార్థులతో పాటు ఫ్యాకల్టీ సభ్యులు చురుకుగా పాల్గొని స్నేహపూర్వక వాతావరణం సృష్టించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. అనంతరం నిర్వహించిన మ్యూజికల్ కాన్సర్ట్ ప్రేక్షకులను అలరించింది. సంగీతం, నృత్య ప్రదర్శనలు వేడుకలను మరిత రంగులు అద్దాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ నితిన్ ఎం.అగార్కర్ విద్యార్థులకు ఓనం శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించడమే కాకుండా జట్టు భావన, నాయకత్వ లక్షణాలు అభివృద్ధి చేస్తాయన్నారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

## వసంత కుమార్ కుటుంబాన్ని... పరామర్శించిన మంత్రి మండిపల్లి

**చిత్తూరు, ఆగస్టు 29 ప్రభాతవార్త:**



ఇటీవల మృతి చెందిన తెలుగుదేశం సీనియర్ నాయకులు, మాజీ కార్పొరేటర్ వసంత కుమార్ కుటుంబ సభ్యులను జిల్లా ఇన్చార్జి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి శనివారం పరామర్శించారు. మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి శనివారం ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ నాయుడు, జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చెక్కుడు కుప్పం షణ్ముఖ రెడ్డి లతో కలిసి మృతి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు వసంత్ కుమార్ కుటుంబ సభ్యులను కలిసి భరోసా ఇచ్చారు. తెలుగుదేశం పార్టీ అన్ని విధాలుగా వసంత కుమార్ కుటుంబానికి అండగా నిలుతుందని వారు వసంత కుమార్ తండ్రి, భార్యా పిల్లలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి సునీల్ కుమార్ చౌదరి, చూడా చైర్ పర్సన్ కటారి హేమలత, చిత్తూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కాజూర్ బాలాజీ తదితరులు ఉన్నారు.

## పైడిపల్లిలో ఉద్రిక్తతకు ముగింపు

–అర్చకుల సమక్షంలో నాగాలమ్మ విగ్రహాలు తొలగింపు –రెవెన్యూ చర్యలకు గ్రామస్తుల ప్రశంసలు

**తిరుపతిరూరల్, ఆగస్టు29 ప్రభాతవార్త:** తిరుపతిరూరల్ మండలం పైడిపల్లిలో కాల్వపోరంబోకు భూమిలో ఏర్పాటు చేసిన నాగాలమ్మ విగ్రహాల వ్యవహారం ఎట్టకేలకు శాంతియుతంగా పరిష్కారమైంది.



ప్రభుత్వ భూమిలో అనుమతి లేకుండా విగ్రహాలు ప్రతిష్టించారన్న ఫిర్యాదుతో ప్రారంభమైన ఉద్రిక్తత శనివారం అర్చకుల సమక్షంలో విగ్రహాలు తొలగించి, పట్టా భూమిలో ఏర్పాటుతో సమస్య ముగిసింది. ఇటీవల ఈ వ్యవహారం ఉద్రిక్తతకు దారితీసిన విషయం తెల్సిందే. గ్రామ రెవెన్యూ అధికారి మురళి ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పహార ఏర్పాటు చేశారు. విగ్రహాల తొలగించేందుకు రెవెన్యూ అధికారులు ముందుకు రావడంతో నిర్వాహకులు అర్చకుల సమక్షంలోనే తొలగించాలని పట్టుబట్టిన విషయం తెల్సిందే. అయితే ఇరువర్గాల మధ్య చర్చల అనంతరం అర్చకుల సమక్షంలోనే విగ్రహాలను శాంతియుతంగా తొలగించారు. అనంతరం వాటిని పట్టాభూమిలో ఏర్పాటు చేసినట్టు సమాచారం. ప్రభుత్వ భూమిలో ఆక్రమణలను ఎట్టి పరిస్థితిల్లోనూ అనుమతించబోమని రెవెన్యూ అధికారులు మరోసారి స్పష్టం చేశారు. ఉద్రిక్తత పరిస్థితులు తలెత్తకుండా పోలీసులు అప్రమత్తంగా వ్యవహారించారు. సమస్యను సమయోచితంగా పరిష్కరించిన గ్రామ రెవెన్యూ అధికారి మురళి తీరుపై గ్రామస్తులు ప్రశంసలు కురిపించారు.

## గంగమ్మ గుడి వద్ద సివిల్ రైట్స్‌డే నిర్వాహణ

**తిరుపతిరూరల్, ఆగస్టు29 ప్రభాతవార్త:**



తిరుపతి అర్బన్ మండలం మంగళం ఏరియా తిరుమలనగర్ గ్రామ పంచాయతీ పరిధిలోని చెంచులక్ష్మీ యానాధి కాలనీలో గంగమ్మ గుడి సమీపంలో శనివారం సివిల్ రైట్స్ డేను ఘనంగా నిర్వహించారు. తిరుపతి అర్బన్ తహశీల్దార్ సురేష్‌బాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పౌర హక్కుల రక్షణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. ప్రతి ఒక్కరూ తమ హక్కులపై అవగాహన పెంపొందించుకుని చట్టబద్ధంగా వాటిని వినియోగించుకోవాలని సూచించారు. సోషియల్ వెల్ఫేర్ శాఖ అధికారులు, పోలీసులు ప్రజలకు చట్టపరమైన రక్షణలు, పౌర హక్కుల చట్టాలపై వివరించారు. ఏదైనా అన్యాయం జరిగితే వెంటనే అధికారులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడి రామచంద్ర, పోలీసులు, సచివాలయ సిబ్బంది, అండన్‌వాడీ, ఆరోగ్య సిబ్బంది, విఆర్వో తదితరులు పాల్గొన్నారు.

## టీటీడీకి రూ.12 లక్షల విలువైన పరికరాలు విరాళం

**తిరుపతి విద్య, ఆగస్టు 29 ప్రభాతవార్త:**



తిరుమల తిరుపతి దేవస్థానాలకు తిరుపతికి చెందిన మురళీ రూ.12 లక్షల విలువైన సీసీ కెమెరాలు, వెబ్ కెమెరాలు, ప్రింటర్లను శనివారం విరాళంగా అందించారు. భక్తుల భద్రతతో పాటు టీటీడీ వివిధ విభాగాల నిర్వహణకు అవసరమైన సాంకేతిక పరికరాలను ఆయన అందజేశారు. తిరుమల శ్రీవారి ఆలయంలోని పోటు పేష్కార్ మునిరత్నంకు మురళీ ఈ పరికరాలను అందించారు. టీటీడీ పరిధిలో భద్రతా ఏర్పాట్లను మరింత పటిష్టం చేయడంలో సీసీ కెమెరాలు ఉపయోగపడనున్నాయి. వెబ్ కెమెరాలు, ప్రింటర్లు సంబంధిత విభాగాల రోజువారీ కార్యకలాపాలకు వినియోగించనున్నారు. శ్రీవారి సేవలో భాగంగా భక్తులు, దాతలు అందిస్తున్న విరాళాలు టీటీడీ సేవా కార్యక్రమాలకు ఉపయోగపడుతున్నాయి. ఈ క్రమంలో రూ.12 లక్షల విలువైన సాంకేతిక పరికరాలను అందించిన మురళీని టీటీడీ అధికారులు అభినందించారు. భక్తుల సౌకర్యం, భద్రతకు సంబంధించిన ఏర్పాట్లలో దాతల సహకారం కొనసాగుతోంది.

## తెలుగుకు గిడుగు రామమూర్తి సేవలు

–బిజెపి చీఫ్ మాధవ్

**తిరుపతి,ఆగస్టు 29ప్రభాతవార్త:**



తెలుగు భాషా వ్యావహారిక రూపానికి విశేష కృషి చేసిన మహనీయుడు గిడుగు వెంకట రామమూర్తి అని బిజెపి చీఫ్ పివిఎన్ మాధవ్ పేర్కొన్నారు. తెలుగుభాష దినోత్సవం సందర్భంగా శనివారం తిరుపతిలో ఆయన చిత్రపటానికి మాధవ్, బిజెపి నాయకులు పుష్పాంజలి ఘటించారు.

## ఆచార్య పేటశ్రీకి సన్మానం



**తిరుపతి,ఆగస్టు 29ప్రభాతవార్త:** తెలుగు భాషా దినోత్సవాన ఎస్పీడిసిఎల్‌లో ఎపి తెలుగు అకాడమీ వ్యవస్థాపక డైరెక్టర్, ఎస్వీయూ విశ్రాంత ఆచార్యులు పేట శ్రీనివాసులు రెడ్డి నిదుశ్శాలువా, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు.

## శ్రీవారి సేవలో ప్రముఖులు

**తిరుమల,ఆగస్టు 29ప్రభాతవార్తప్రతినిధి:**



శ్రీవేంకటేశ్వరస్వామిని శనివారం ఉదయం ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ దర్శించుకున్నారు.

## డీఎస్పీచే తవనంపల్లె పోలీస్‌స్టేషన్ ఆకస్మికంగా తనిఖీ

**తవణంపల్లె, ఆగస్టు 29 ప్రభాతవార్త:**



మండల పోలీస్‌స్టేషన్‌ను చిత్తూరు డీఎస్పీ వెంకట రమణ శనివారం ఆకస్మికం గా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన స్టేషన్‌లోని రికార్డులను, సీడీ ఫైళ్ళను తనిఖీ చేశారు. అలాగే మండలంలో నమోదైన కేసుల వివరాలు, పెండింగ్ కేసులు వంటి వాటి గురించి స్థానిక ఎస్సై రమేష్‌బాబును అడిగి తెలుసుకున్నారు. మండలంలో నేరాలు జరుగకుండా గట్టి చర్యలు తీసుకోవాలని ఎస్సైను ఆదేశించారు. ఈకార్యక్రమంలో మండల పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మద్యం మత్తులో... వ్యక్తిపై దాడి!

– చికిత్స పొందుతూ మృతి
– హత్య కేసులో ముగ్గురు నిందితుల అరెస్ట్
– నేండ్రగుంట ఫ్లైఓవర్ వద్ద పాకాల పోలీసులకు చిక్కిన నిందితులు

**పాకాల, ఆగస్టు 29 ప్రభాతవార్త**



మద్యం మత్తులో ఓ వ్యక్తిపై దాడి చేసి, అనంతరం ర్యాంపుపై నుంచి కిందకు తోసి వేయ డంతో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటనలో ముగ్గురు నిందితులను పాకాల పోలీసులు అరెస్ట్ చేశారు. అరెస్టు చేసిన నిందితులను రిమాండ్‌కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం.. మృతుడు ఆకుల కిరణ్ (33) కు నిందితులు నిఖిల్ (20), మహాసముద్రం రూపేష్ (20), పాకాల నరేష్ రెడ్డి (24) తో గతంలో పరిచయం ఉంది. ఈ నెల 22న దామలచెరువు వైన్‌షాప్ సమీపంలో కిరణ్‌ను తమ వెంట తీసుకెళ్లిన నిందితులు సమీపంలోని మామిడి తోటలో కలిసి మద్యం సేవించారు. అక్కడ వారి మధ్య గొడవ జరగడంతో కిరణ్‌ను అక్కడే వదిలి వెళ్లిపోయారు. అనంతరం కుక్కలపల్లి గ్రామం సమీపంలోని మామిడికాయల ర్యాంపు వద్ద ముగ్గురు నిందితులు మద్యం సేవిస్తుండగా, అదే రోజు రాత్రి సుమారు 7 గంటల సమయంలో కిరణ్ అక్కడికి వచ్చి తనను పిలవకుండా మద్యం సేవిస్తున్నారని వారితో గొడవపడ్డాడు. దీంతో మద్యం మత్తులో ఉన్న ముగ్గురు నిందితులు కిరణ్‌పై చేతులు, కాళ్లతో దాడి చేసి, అనంతరం ర్యాంపుపై నుంచి కిందకు తోసివేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఈ ఘటనలో కిరణ్ తలకు తీవ్ర గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. తొలుత పోలీసులు హత్యాయత్నం కేసుగా దర్యాప్తు ప్రారంభించారు. అయితే చికిత్స పొందుతూ కిరణ్ మృతి చెందడంతో కేసును హత్య కేసుగా మార్చి దర్యాప్తు కొనసాగించారు. జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, ఆదేశాల మేరకు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసి నిందితుల కోసం గాలింపు చేపట్టారు. పోలీసులకు అందిన విశ్వసనీయ సమాచారంతో ఈ నెల 29న ఉదయం సుమారు 8.30 గంటలకు నేండ్రగుంట ఫ్లైఓవర్ వద్ద ముగ్గురు నిందితులను పాకాల పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ టి. చిన్న గోవిందు అరెస్ట్ చేశారు. అనంతరం వారిని రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ మద్యం లేదా ఇతర మత్తు పదార్థాల ప్రభావంలో హింసాత్మక చర్యలకు పాల్పడి ఇతరుల ప్రాణాలకు ముప్పు కలిగిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు వివాదాలను హింసాత్మకంగా పరిష్కరించుకోకుండా సమస్యలు తలెత్తినప్పుడు పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. నేరాలకు పాల్పడే వారిపై సమర్థవంతమైన దర్యాప్తు చేపట్టి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడమే పోలీసు శాఖ లక్ష్యమని తెలిపారు.

## ఘనంగా తెలుగు భాషాదినోత్సవం

**విజయపురం, ఆగస్టు 29 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం



తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు సుమతి మాట్లాడుతూ గిడుగు వెంకటరామమూర్తి పంతులు తెలుగు భాషకు చేసిన అపార సేవలకు గుర్తుగా తెలుగు భాషాదినోత్సవం జరుపుకుంటున్నట్టు విద్యార్థులకు తెలిపారు. అనంతరం హాకీ క్రీడాకారుడు ధ్యాన్ చంద్, గిడుగు రామమూర్తి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని అలరించాయి. తెలుగు ఉపాధ్యాయుడు హరి, తదితర ఉపాధ్యాయ బృందం కార్యక్రమంలో పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## వివాహిత ఆత్మహత్య!



**రేణిగుంట, ఆగస్టు 29 ప్రభాతవార్త:** రేణిగుంట పోలీస్‌స్టేషన్ పరిధిలోని అన్నాస్వామిపల్లి గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. 35 ఏళ్ల వివాహిత మహిళ వరకుమారి శనివారం ఆత్మహత్యకు పాల్పడి మృతి చెందింది. ఇద్దరు చిన్నారులకు తల్లిగా ఉన్న ఆమె ఆకస్మిక మరణంతో కుటుంబంలో విషాదఛాయలు అలముకున్నాయి. పోలీసులు తెలిపిన ప్రాథమిక వివరాల మేరకు.. వరకు మారికి సుమారు 11 సంవత్సరాల క్రితం చాణుక్యతో వివాహం జరిగింది. ఈ దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గత కొంతకాలంగా కుటుంబ జీవితం సాధారణంగానే సాగుతున్నట్లు సమాచారం. అయితే శనివారం ఉదయం ఆమె ఇంట్లో ఎవరూ లేని సమయంలో మొదటి అంతస్తులోని రేకుల షెడ్డు వద్ద చీరతో ఉరి వేసుకుని వేలాడుతున్నట్లు కుటుంబ సభ్యులు గుర్తించారు. ఈ ఘటనకు ముందు పిల్లల ఆరోగ్యం సరిగా లేకపోవడంతో ఉదయం సుమారు 10 గంటల సమయంలో వరకుమారి భర్త తన కుమార్తెను ఆసుపత్రికి తీసుకెళ్లినట్లు పోలీసులు తెలిపారు. కొద్దిసేపటి అనంతరం ఇంటికి వచ్చిన కుటుంబ సభ్యులు వరకుమారి ఉరి వేసుకొని వేలాడుతున్న స్థితిలో కనిపించడంతో వెంటనే ఆమెను కిందకు దించి చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సమాచారం అందుకున్న రేణిగుంట అర్బన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతురాలి తల్లి డి. మునిమ్మ (60) ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆత్మహత్యకు గల కారణాలు ఏమిటన్న దానిపై పోలీసులు వివిధ కోణాల్లో విచారణ చేస్తున్నారు. మృతదేహానికి పంచనామా నిర్వహించిన అనంతరం పోస్టుమార్టం నిమిత్తం తిరుపతిలోని రుయాస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం నివేదిక, దర్యాప్తులో వెల్లడయ్యే అంశాల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు పోలీసులు తెలిపారు.

## సాంకేతిక పరిజ్ఞానంలో నేరస్తుల కన్నా... పోలీసులు ముందుండాలి

– సిబ్బందికి సైబర్ క్రైమ్ ఇన్వెస్టిగేషన్, డిజిటల్ ఫోరెన్సిక్‌లపై శిక్షణ పూర్తి
– తిరుపతి ఎస్పీ సుబ్బారాయుడు



**తిరుపతి క్రైమ్, ఆగస్టు 29 ప్రభాతవార్త:** నేటి ఆధునిక సమాజంలో రోజురోజుకీ సైబర్, డిజిటల్ నేరాలు పెరుగుతున్నాయని వాటిని ఎదుర్కొనేందుకు పోలీస్ సిబ్బంది కూడా సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని తిరుపతి ఎస్పీ సుబ్బారాయుడు సూచించారు. తిరుపతి జిల్లా పోలీస్ శాఖ 100 మంది పైగా సిబ్బందికి సైబర్ క్రైమ్ ఇన్వెస్టిగేషన్, డిజిటల్ ఫోరెన్సిక్ శిక్షణను శనివారంతో పూర్తి చేశారు. ఈ కార్యక్రమాన్ని తిరుపతి జిల్లా పోలీస్ కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్‌లో నీలిట్వా వారి సౌజన్యంతో నిర్వహించిన ముగింపు కార్యక్రమం వాల్లేడిక్టరీ సెషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తిరుపతి ఎస్పి సుబ్బారాయుడు హాజరై 100 మందికి పైగా శిక్షణ పూర్తి చేసుకున్న అధికారులను సిబ్బందిని అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ సాంకేతికతతో పాటు మారుతున్న సైబర్ నేరాల సరళి, ప్రస్తుత రోజుల్లో సాంకేతికత, సెల్‌ఫోన్లు, సోషల్ మీడియా ప్రతి ఒక్కరి జీవితంలో భాగమైపోయాయని ఎస్పీ తెలిపారు. నేరస్థులు సాంకేతికతను దుర్వినియోగం చేస్తూ ఫేక్ న్యూస్ వ్యాప్తి, నకిలీ లింకుల సృష్టి, ఆన్‌లైన్ టికెట్ ఫ్రాడ్స్, డిజిటల్ మోసాలు వంటి నేరాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. వివిధ వర్గాల ప్రజలను, ముఖ్యంగా విదేశాల్లో పిల్లలు చదువుకుంటున్న తల్లిదండ్రులను సైతం లక్ష్యంగా చేసుకుని సైబర్ మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. కేసు నమోదు అనంతరం ఛేదనకు శిక్షణ ఎంతో ఉపయోగకరం, సైబర్ నేరానికి సంబంధించి కేసు నమోదు అయిన తర్వాత నేరస్థులు ఎలాంటి సాంకేతికతను ఉపయోగించారు, డిజిటల్ ఆధారాలను ఏ విధంగా సేకరించి విశ్లేషించాలి అనే అంశాలపై ఈ శిక్షణ ఎంతో దోహదపడుతుందని ఎస్పీ తెలిపారు. శిక్షణలో నేర్చుకున్న సబ్జెక్ట్ పరిజ్ఞానాన్ని రోజువారీ దర్యాప్తులో సమర్థవంతంగా వినియోగించడం ద్వారా నాణ్యమైన దర్యాప్తు చేపట్టవచ్చని చెప్పారు. నేరస్థుల కంటే ఒక అడుగు ముందుండాలి, సైబర్ నేరస్థులు ఎప్పటికప్పుడు కొత్త పద్ధతులు, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నందున పోలీసు అధికారులు కూడా తమ సాంకేతిక నైపుణ్యాలను నిరంతరం అప్‌డేట్ చేసుకోవాలని ఎస్పీ సూచించారు. సైబర్ నేరాల దర్యాప్తులో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, డిజిటల్ ఫోరెన్సిక్స్‌పై అవగాహన పెంపొందించుకోవడం ద్వారా నేరాలను వేగంగా ఛేదించడంతో పాటు దర్యాప్తు నాణ్యతను మరింత మెరుగుపరచవచ్చని తెలిపారు. పోలీసు అధికారులు, సిబ్బందికి సైబర్ క్రైమ్ ఇన్వెస్టిగేషన్, డిజిటల్ ఫోరెన్సిక్స్‌పై మెరుగైన శిక్షణ అందించిన నీలిట్టి తిరుపతి డైరెక్టర్ శివకుమార్, ఫ్యాకల్టీ సభ్యులు అఖిల్, మనీష్ యాదవ్లకు ఎస్పీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే ఈ శిక్షణ కార్యక్రమాన్ని సమన్వయం చేసి విజయవంతంగా నిర్వహించిన అడిషనల్ ఎస్పీ ఐ రామకృష్ణ, సైబర్ టీమ్ ఇన్‌స్పెక్టర్ వినోద్, ఐటీ కోర్ సిబ్బందిని అభినందించారు.

## బ్రహ్మోత్సవాల బందోబస్తు ఏర్పాట్లపై డీఎస్పీ సమీక్ష

**కాణిపాకం, ఆగస్టు 29 ప్రభాతవార్త:** కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వా మివారి దేవస్థానంలో జరుగనున్న స్వామివారి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేయనున్న బందోబ స్తుఏర్పా ట్లుపై చిత్తూరు డీఎస్పీ వెంకటరమణ శనివారం సమీక్షించారు. దేవస్థానంలో సెపెంబర్ 14 నుండి 21 రోజుల పాటు స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగనున్న నేపథ్యంలో శాంతి భద్రతల పరిరక్షణకు చేపట్టవలసిన బందోబస్తు ఏర్పాట్లు విషయంగా పోలీస్‌స్టేషన్‌లో సమీక్షించారు. ఈసందర్భంగా బందోబస్తు డ్రాఫ్ట్ స్కీం తయారీపై పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓతో సమీక్షిస్తూ దిశా నిర్దేశం చేశారు. అలాగే భక్తుల రద్దీ, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, సీసీటీవీ నిఘా, నేర నివారణ చర్యలపై ముందస్తు ప్రణాళికతో పటిష్ట ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. ఈకార్యక్రమంలోస్థానిక ఎస్సై నరసింహులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వ్యభిచార గృహంపై అలిపిరి పోలీసుల దాడి.

– ఐదుగురు అరెస్ట్ – వినియోగించని కండోమ్స్, రూ.18,000 నగదు స్వాధీనం
– బ్రోతల్‌గా ఉపయోగించిన ఇంటిని చట్టప్రకారం స్వాధీనం – అటాచ్‌మెంట్ చేసేందుకు ఆర్‌డిఓ ప్రతిపాదన.

**తిరుపతి క్రైమ్, ఆగస్టు 29, ప్రభాతవార్త**

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అలిపిరి పోలీసులకు రాబడిన పక్కా సమాచారం మేరకు ఆ స్టేషన్ పరిధిలోని తిరుమల రెడ్డి నగర్‌లో వ్యభిచార కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఇంటిపై దాడి నిర్వహించి ఐదుగురిని అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా అలిపిరి సీఐ రామకిషోర్ సమాచారం మేరకు తిరుమల రెడ్డి నగర్‌లోని ఒక ఇంటి మొదటి అంతస్తుపై దాడి నిర్వహించారు. దాడి సమయంలో ఇంట్లో పలువురు వ్యక్తులు ఉండగా, విచారణ దర్యాప్తులో ఇంటిని వ్యభిచార కార్యకలాపాలకు ఉపయోగిస్తూ మహిళలను తీసుకువచ్చి కస్టమర్లకు పంపుతున్నట్లు ప్రాథమికంగా వెల్లడైంది. ఈ కేసులో నీలావతి, జయచంద్ర నాయుడు అలియాస్ ప్రకాష్, అశోక్ కుమార్, ముని క్రాంతి కుమార్ అలియాస్ కుమార్, శివానందంలను అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచారు. దాడిలో వినియోగించని కండోమ్స్ మరియు రూ.18,000 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ఎ3 గా ఉన్నటువంటి గోపి పోలీసులు నుండి పరారయ్యాడు. నిందితుడిని తీవ్రంగా గాలిస్తున్నారు. ఇదిలా ఉండగా బాధితురాలని మహిళా పోలీస్ సంరక్షణలో చికిత్సను అందించి సురక్షితంగా మహిళా ప్రాంగణానికి తరలించారు. ఈ సందర్భంగా సిఐ రామ కిషోర్ మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న మహిళలను తీసుకొచ్చి అద్దెకు గృహాలు తీసుకుని ఇద్దరు నేరస్థులు కస్టమర్లకు సమర్పిస్తూ ఆర్థికంగా లాభపడేవారు అని వివరించారు. అద్దెకు తీసుకున్న ఇల్లని వ్యభిచార గృహంగా వినియోగించినందుకు ఆ ఇంటిని సీజ్ చేసి ఆర్డీవోకి లేక ద్వారా అటాచ్మెంట్ చేసినట్లు వివరించారు. అదేవిధంగా సుదూర ప్రాంతాల్లో ఉంటూ తమ ఇళ్లను అద్దెకి ఇచ్చే యజమానులు తప్పనిసరిగా వారి నుండి తగిన గుర్తింపు కార్డు తీసుకుని పూర్తిగా విచారించి అద్దెకి ఇవ్వాలని సూచించారు.

## గిడుగు రామ్మూర్తికి పుష్పాంజలి

**తిరుపతి,ఆగస్టు 29ప్రభాతవార్త:**



పద్మావతి మహిళా విశ్వ విద్యాలయం తెలుగు శాఖ ఆధ్వర్యంలో గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి నివాళులర్పించారు. అధ్యాపకులు, విద్యార్థులు తెలుగు భాషా దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. తెలుగు భాషకి అపారమైన సేవ చేసిన గిడుగు సేవలను స్మరించుకున్నారు. తెలుగు భాష గొప్పతనం గురించి విద్యార్థులు సంగీతాలాపన గావించారు.

## తిరుమలలో దుకాణాల తనిఖీలు




బ్రహ్మోత్సవాల ముందు దుకాణాలను తనిఖీ చేస్తున్న టిటిడి

ప్రభాతవార్త–తిరుమల